# ప్రజాశక్తి

ఆదివారం 9 ఫిబ్రవరి 2025 8 పేజీలు




గుంటూరు



పల్నాడు

# సి.బిల్లుల పేరుతో నిధుల స్వాహా

## ప్రత్యేక ఆడిట్ బృందంతో కొనసాగుతున్న తనిఖీలు - కార్పొరేషన్‌లో అక్రమాలపై విజిలెన్సు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి




గుంటూరు నగర పాలక సంస్థలో నాలుగేళ్లలో జరిగిన అవినీతి అక్రమాలపై నగర కమిషనర్ పులి శ్రీనివాసులు దృష్టి సారించారు. సి.బిల్సు (కంటిన్‌జెంట్) పేరుతో రూ.87 కోట్ల వరకు దుర్వినియోగం జరిగినట్టు ఆయన ప్రాథమికంగా గుర్తించారు. రూ.లక్షలోపు మాత్రమే ఈ బిల్లులు వినియోగించాల్సి ఉన్నా నామినేషన్ పద్ధతిలో రూ.3 నుంచి రూ.5 లక్షల వరకు వెచ్చించారని తెలిసింది. ప్రధానంగా నగర పాలక సంస్థ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమాల అమలుకు కేటాయించిన నిధులతో పాటు నగరపాలక సంస్థ నిధులు కూడా వెచ్చించి పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డట్టు తెలిసింది.

గత ప్రభుత్వ హయాలో నిర్వహించిన జగనన్న సురక్ష, ఆడుదాం ఆంధ్ర తదితర కార్యక్రమాలకు ప్రభుత్వం నిధులు కేటాయించినా ప్రజలకు మౌలిక సదుపాయాల పేరుతో నగర పాలక సంస్థ నిధులు కూడా రూ.కోట్లలో వెచ్చించారు. ఇందుకు సంబంధించి బిల్లులు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉంది. అంతేకాకుండా ఫిక్స్‌డ్ డిపాజిట్ల నిధులను డ్రా చేసి కాంట్రాక్టర్లకు చెల్లించడం తదితర అంశాలపై కూడా కమిషనర్ ప్రతి బిల్లునూ పరిశీలిస్తున్నారు. ప్రధానంగా ఎన్‌టిఆర్ స్టేడియంలో అనుమతి లేకుండా రూ.2 కోట్లతో జిమ్ నిర్మాణ పనులు, గాంధీ పార్కులో అభివృద్ధి పనుల పేరుతో రూ.6 కోట్ల వరకు వెచ్చించడం, మునిసిపల్ వాహనాల వినియోగంలో ఇబ్బడి ముబ్బడిగా డీజిల్ వినియోగం, మరమ్మతుల పేరుతో అక్రమాలు, కార్పొరేషన్‌లో సమావేశ మందిరం ఆధునీకకరణ పేరుతో రూ.80 లక్షల వినియోగం, మునిసిపల్ స్థలాల ఆక్రమణలు, అక్రమ వినియోగం, విక్రయాలపైనా విచారణ జరుగుతోంది. హోర్డింగ్‌ల నిర్వాహకుల నుంచి రావాల్సిన ఆదాయాన్ని నగర పాలక సంస్థ ఖజానాకు జమకాకపోవడం, ఆశీలు వసూలు చేయకుండా అనధికారికంగా జరిగిన వసూళ్లపై కూడా అధికారులు ఆరా తీస్తున్నారు.

కరోనా రెండో దశలో కూడా ప్రజలకు పలు స్వచ్ఛంద సంస్థలు అందించిన సేవలను కూడా నగరపాలక సంస్థ ఖాతాల్లో రాసుకుని బిల్లులు చేసుకున్నట్టు గుర్తించారు. అంతేగాకుండా రహదారుల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలపై కూడా థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోలు బృందాల ద్వారా తనిఖీ చేయించాలని కమిషనర్ ప్రభుత్వానికి నివేదించినట్టు తెలిసింది. పలు సివిల్ వర్కులు నామినేషన్ పద్ధతిలో చేయించి నిధులు స్వాహా చేసినట్టు చెబుతున్నారు. అలాగే ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకంలోనూ ప్రామాణికత లేకుండా చేసి పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డట్టు తెలిసింది. 2021 మార్చి 18న నూతన కౌన్సిల్ కొలువుదీరినప్పటి నుంచి ఇప్పటి వరకు కౌన్సిల్ ఆమోదంతో చేసిన పనులు, ఆమోదం లేకుండా ఖర్చుపెట్టిన నిధులు, కంటింజెన్సు ఫండ్స్ పేరుతో అక్రమాలు జరిగినట్టు గుర్తించారు.

**విజిలెన్సు విచారణ చేయిస్తాం : కమిషనర్**

నగర పాలక సంస్థలో గత నాలుగేళ్లలో జరిగిన అవినీతి అక్రమాలపై విజిలెన్సు విచారణ చేయించాలని నిర్ణయించామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ప్రభుత్వం కేటాయించిన నిధులతో పాటు కార్పొరేషన్ నుంచి వివిధ పనుల కోసం ఖర్చు చేసిన నిధులపై విచారణ జరగాల్సి ఉందన్నారు. ప్రత్యేక ఆడిట్ టీం ద్వారా విచారణ జరుగుతోందన్నారు. ఆడిట్ నివేదిక ఆధారంగా విజిలెన్సు దర్యాప్తునకు సిఫార్సు చేస్తామని ఆయన వెల్లడించారు. బుడమేరు వరదల్లో బాధితులకు సాయం అందించేందుకు వినియోగించిన నిధులు రూ.9.24 కోట్లు ప్రభుత్వం త్వరలోనే కార్పొరేషన్‌కు తిరిగి జమ చేస్తుందన్నారు. ఇప్పటికే పలు మునిసిపాలిటీలకు నిధులు జమ కావడం ప్రారంభమైందన్నారు. గుంటూరు, విజయవాడకు త్వరలో ఈ నిధులు వస్తాయని ఉన్నతాధికారులు వెల్లడించారన్నారు. వరద బాధితులకు ఖర్చు పెట్టిన నిధుల్లో అక్రమాలకు ఆస్కారం లేదన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కెఎస్ లక్ష్మణరావు, కొండా రామిరెడ్డి, హనుమంతరావు తదితరులు

# ప్రజా సమస్యలే మా అజెండా

- పోరాడే శక్తులకు అండగా ఉంటా
- రేపటి నామినేషన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి
- పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

సమస్యల పరిష్కారానికి పోరాడే శక్తులకు మండలి వేదికగా, బయటా పిడిఎఫ్ అండగా ఉంటుందని, ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపించాలని ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు కోరారు. శనివారం స్థానిక గీతా రీజెన్సీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈనెల 10న నామినేషన్ కార్యక్రమం జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్ ఆవిష్కరించారు. ఉదయం 10 గంటలకు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సభ, అనంతరం 12 గంటల నుండి కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేస్తామన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పిడిఎఫ్ పోషిస్తున్న నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్రను కొనసాగిస్తామని చెప్పారు. 2007లో శాసన మండలి పునరుద్ధరించిన నాటి నుండి 14 మంది పిడిఎఫ్ ఎమ్మెల్సీలు గెలుపొంది, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, రైతులు, ఇతర బాధిత వర్గాల సమస్యల పరిష్కారానికి అత్యంత నిజాయతీగా కృషి చేస్తున్నామని చెప్పారు. మండలి ఆయా వర్గాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లటంతోపాటు, బయట జరిగే పోరాటాల్లోనూ ప్రత్యక్షంగా పాల్గొంటూ మద్దతు ఇస్తున్నామన్నారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లోనూ గుంటూరు ఛానల్, వరికెపుడిశెల, కౌలు రైతుల సమస్యలు, పట్టణాల్లో మౌలిక వసతులు వంటి అనేక అంశాలపై నిరంతరం పోరాడుతున్నామన్నారు. రాజ్యాంగ నిర్మాతలు దూరదృష్టితో టీచర్లు, గ్రాడ్యుయేట్ల సమస్యలపై ప్రాతినిధ్యం కోసం ఏర్పాటు చేసిన టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లోనూ రాజకీయ పార్టీలు నేరుగా పోటీ చేస్తున్నాయన్నారు. తాను ప్రజా సమస్యల సమస్యలకు మండలిలో గొంతుకగా ఉంటానని, తనకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. నామినేషన్ కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, ఇతర ప్రజా సంఘాల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో యూటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ హనుమంతరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యు.రాజశేఖరరావు, ఎం.కళాధర్, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు కుమార్, సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ, మేధావుల ఫోరం నాయకులు అవధానుల హరి, ఐద్వా జిల్లా కార్యదర్శి అరుణ, తదితరులు పాల్గొన్నారు.

# దూరం చేసి వైద్యాన్ని భారం చేయొద్దు..

- తల్లీపిల్లల ఆస్పత్రి తరలింపు ప్రతిపాదనపై విమర్శలు
- అన్ని మండలాల నుండి రాకపోలకు వీలైన పాత ఆస్పత్రిలోనే కొనసాగిస్తూ, అభివృద్ధి చేయాలని అభిప్రాయాలు

2 లో

ప్రసవం కోసం వార్డు వద్ద వేచిఉన్న గర్భిణి



చిన్నారికి టీకా వేస్తున్న డాక్టర్



# ధరల్లేక అల్లాడుతున్న మిర్చి రైతులు

## 11న 'శారద'లో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్

**ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ (విజయవాడ) :** గాంధీనగర్‌లోని శారద డిగ్రీ కళాశాలలో ఈ నెల 11న క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కళాశాల సెక్రటరీ కుందా రామ నారాయణ తెలిపారు. శనివారం కళాశాల కాన్ఫరెన్స్ హాల్లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాల ఆధ్వర్యంలో 11వ తేదీ మంగళవారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ నిర్వహిస్తున్నామని అన్నారు. తమ కళాశాల విద్యార్థులతో పాటు నగరంలోని అన్ని డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీ వివిధ ఉద్యోగాలకు సంబంధించి ఈ డ్రైవ్ నిర్వహిస్తుందని అన్నారు. డిగ్రీ పూర్తయిన విద్యార్థులతో పాటు చివరి సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులు కూడా పాల్గొనవచ్చని తెలిపారు. డిగ్రీ పూర్తయ్యే లోగా ఉద్యోగం కల్పించాలనే ఉద్దేశంతో శారద కళాశాల వివిధ కార్పొరేట్ కంపెనీలతో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తుందని అన్నారు. ఉదయం 10 గంటల నుండి జరుగుతుందని విద్యార్థులు వివరాలకు కళాశాల ఆఫీసులో సంప్రదించవచ్చని తెలిపారు.

## 12న పిబి సిద్ధార్థలో శాస్త్ర విభాగాల మెగా ఈవెంట్

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** శాస్త్రవిజ్ఞానాన్ని యువతరంలో వ్యాప్తిచేయడానికి సీయన్షియా పేరుతో విజయవాడలోని పి.బి.సిద్ధార్థ కళాశాలకు చెందిన వృక్ష, జంతు, జీవసాంకేతికశాస్త్ర విభాగాలు సంయుక్తంగా ఈ నెల 12న ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కన్వీనర్, వృక్షశాస్త్రాధిపతి డాక్టర్ పువ్వాడ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం కళాశాలలో ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ ఆచార్య రాజేష్ సి.జంపాల ఆవిష్కరించారు. సియన్షియా కోకన్వీనర్ డాక్టర్ సాంబానాయక్, అధ్యాపకులు డి.శ్రావణి, సి.హెచ్.శిరీష, పి.లలితాప్రియాంక పాల్గొన్నారు. సియన్షియాలో భాగంగా ఈ నెల 12న ఉదయం నుంచి సాయంత్రం వరకు క్విజ్, పి.పి.టి., పోస్టర్, అరుదైన జీవజాల సమాచార ప్రదర్శన, మిస్టర్ అండ్ మిస్ బయో తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. ఎన్టీఆర్, కృష్ణా, ఉభయగోదావరి, గుంటూరు జిల్లాల నుంచి డిగ్రీ కళాశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు.

## మలబార్‌లో బ్రైడల్ ఆభరణాల ప్రదర్శన

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్**

నగరంలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూంలో శనివారం బ్రైడల్ ఆభరణాల ప్రదర్శన ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎం.జీ. రోడ్డులోని షోరూంలో ఏర్పాటు చేసిన సమావేశం లో షోరూం హెడ్ అర్జున్ మాట్లాడుతూ ప్రత్యేకంగా మహిళల కోసం అన్ని రకాలైన డిజైన్స్ అందించడం కోసం ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రానున్న వివాహ శుభకార్యాల కోసం ప్రత్యేకంగా ఆభరణాలను ప్రదర్శనలో ఉంచినట్లు తెలిపారు. ఈ ప్రదర్శన ఈ నెల 8 నుంచి 22వ తేదీ వరకు ఉంటుందని అన్నారు. వివరాలకు నగరంలోని మలబార్ షోరూంలో సంప్రదించవచ్చని తెలిపారు.

# దూరం చేసి వైద్యాన్ని భారం చేయొద్దు..

### తల్లీపిల్లల ఆస్పత్రి తరలింపు ప్రతిపాదనపై విమర్శలు - పాత ఆస్పత్రిలోనే కొనసాగిస్తూ అభివృద్ధి చేయాలని అభిప్రాయాలు

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణ నడిబొడ్డున పల్నాడు రోడ్డులోని పాత ప్రభుత్వ వైద్యశాలలో మాతా శిశువైద్యసేవలు కొనసాగుతున్నాయి. లింగంగుంట్ల 200 పడకల జిల్లా ఆసుపత్రి అందుబాటులోకి వచ్చాక పల్నాడు రోడ్డులోని పాత ఆస్పత్రిని మాతా శిశువులకు మాత్రమే పరిమితం చేశారు. ఈ వైద్యశాల మాచర్ల నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలు, తండా వాసులతో పాటు పల్నాడు జిల్లాలోని 28 మండలాలకు చెందిన గర్భిణులను అందుబాటులో ఉంది. వ్యాధి నిరోధక టీకాలు, ప్రసవాల కోసం ఏ మండలం నుండి అయినా నరసరావుపేటకు బస్సులో వచ్చి హాస్పిటల్ ముందు దిగి వైద్య సేవలు పొందిన అనంతరం అక్కడే బస్సు ఎక్కి వెళ్లే సదుపాయం ఉంది. అయితే ఈ విభాగాన్ని కూడా లింగంగుంట్లలోని జిల్లా ఆసుపత్రికి తరలించే యోచన చేస్తున్నారు. ఇందుకోసం వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇదే జరిగితే గర్భిణులు, బాలింతలు అవస్థలలతోపాటు ఆర్థికంగానూ ఇబ్బందులు పడక తప్పదనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

### చర్చించకుండానే ప్రతిపాదనలు!

లింగంగుంట్ల ఏరియా ఆస్పత్రిలోని ఒక బ్లాక్ మాతా శిశు సేవలకు కేటాయించేందుకు డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కమిషనర్ డాక్టర్ సిరి, జాయింట్ కమిషనర్ డాక్టర్ రమేష్ కిషోర్ ఇటీవల పరిశీలించారు. కమిషనర్ స్థాయి అధికారులు వచ్చినప్పుడు హాస్పిటల్‌లోని లోపాలను, సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సి ఉండగా రూ.37 కోట్ల కేంద్ర ప్రభుత్వం నిధులతో ఏర్పాటు చేయనున్న



గర్భిణులు, వారి సహాయకులతో కిటకిటలాడుతున్న చిన్నారుల వార్డు

క్రిటికల్ కేర్ హాస్పిటల్‌కు స్థల కేటాయింపు వ్యవహారాన్ని పరిగణలోకి తీసుకోకుండా మాతా శిశు వైద్య సేవలను లింగంగుంట్ల ఆసుపత్రికి మార్చాలని ప్రతిపాదించారు. జిల్లా కలెక్టర్, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్‌తోనూ చర్చించకపోవడంపైనా అధికార వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఆసుపత్రి నిర్మాణానికి అనువైన స్థలం కోసం అన్వేషించాల్సిన ఉన్నతాధికారులు మాతా శిశువులకు అందుబాటులో సౌకర్యవంతంగా ఉన్న ఆస్పత్రిని తరలించడంపై విమర్శలు వస్తున్నాయి.

రెండెకరాల విస్తీర్ణంలో ఉన్న పాత గవర్నమెంట్ హాస్పిటల్‌లో కొన్ని భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. మతా శిశులు ఆస్పత్రిగా గుర్తించి కొత్త భవనాలు నిర్మించాలనే ప్రతిపాదనలున్నా స్థల ఎంపికలో జాప్యం నెలకొంది. అందరికీ అందుబాటులో ఉన్న హాస్పిటల్‌లో దాదాపు నెలకు 300 వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. ఇదే సముదాయంలో అత్యాధునిక వైద్య ప్రమాణాలతో మొదట ఒక బ్లాక్ నిర్మించి సేవలకు అంతరాయం లేకుండా మాతా, శిశు సేవలు కొనసాగించాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా చర్యలు మాని ఇప్పటికే రోజుకు వెయ్యి ఓపీ, నిత్యం 150 మందికి పైగా ఇన్‌పేషెంట్లతో ఉండే జిల్లా వైద్యశాలకు మాతాశిశు విభాగాన్ని తరలించడం మంచిది కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనికితోడు పాత ఆస్పత్రి భవనాన్ని ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు ఉపయోగించే యోచనలోనూ అధికారులున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీటన్నింటి నేపథ్యంలో స్థానిక ప్రజాప్రతినిధులైనా కలుగజేసుకుని మాతాశిశు వైద్యశాల కొనసాగేలా చూడాలనే డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.

# కిడ్నీ వ్యాధి ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు : ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్

**ప్రజాశక్తి-విజయవాడ**

ఎ.కొండూరులో కిడ్నీ వ్యాధి ప్రభావిత ప్రాంతాల్లో వైద్య ఆరోగ్యశాఖ, వివిధ శాఖల సమన్వయంతో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని, కార్యక్రమాల నిర్వహణ, పర్యవేక్షణకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన ఎ.కొండూరు కిడ్నీ వ్యాధి ప్రభావిత ప్రాంతాల్లో భవిష్యత్తు కార్యాచరణపై సమన్వయ సమావేశం జరిగింది. క్రానిక్ కిడ్నీ డిసీజ్ (సీకేడీ) కేసులపై ఈ ఏడాది జనవరి 18న జీజీహెచ్‌లో స్పెషలిస్టు వైద్యులతో జరిగిన సమావేశంలో చర్చించిన అంశాలు, వచ్చిన సూచనలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీల్చే గాలిలో యురేనియం, కాడ్మియం, ఆర్సెనిక్ తదితర ఆనవాళ్లు ఏమైనా ఉన్నాయా? అనే దాన్ని నిర్ధారించేందుకు 20 రోజుల్లోగా పరీక్షలు నిర్వహించాలని కాలుష్య నియంత్రణ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ ద్వారా నెఫ్రో టాక్సిక్ మెటల్‌కు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

సంబంధించి సాయిల్ పరీక్షలు నిర్వహించాలన్నారు. ఇప్పటికే గ్రామీణ నీటి సరఫరా శాఖ ఒకవైపు సురక్షిత తాగునీటిని అందిస్తూనే మరోవైపు భూగర్భ జలాల నమూనాలను భార, హానికర మూలకాలపై ఐసీఎంఆర్, ఏఎన్‌జీఆర్‌యూ ల్యాబ్స్‌లో నిర్వహించిన పరీక్షల ఫలితాలు సాధారణంగా ఉన్నందున ఇళ్ల ఆవరణల్లోని నీటి వనరుల నమూనాలను కూడా పరీక్షించాలని సూచించారు. ఒకవైపు శాస్త్రీయ శోధనలు నిర్వహిస్తూనే ఈలోపు 3,600 గృహాలున్న 15 తండాలతో పాటు తండాయేతర ప్రాంతాల్లోనూ అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఎక్సైజ్ శాఖ ఇప్పటికే నవోదయం ద్వారా వివిధ కార్యక్రమాలు చేపడుతోందని, వీటిని విస్తరించాల్సిన అవసరముందన్నారు. కాపుసారాకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయడం, విచ్చలవిడిగా పెయిన్ కిల్లర్స్, యాంటీ బయాటిక్స్ వంటివి వాడకుండా చూడటం తదితరాలపై వినూత్నంగా కళాజాతా ప్రదర్శనలు ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా నెఫ్రాలజిస్టు, డయాలసిస్ సేవలు నిరాంటకంగా షెడ్యూల్ ప్రకారం కొనసాగేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డా.ఎం.సుహాసిని, డీసీహెచ్ఎస్ డా. బీసీకే నాయక్, అసోసియేట్ ప్రొఫెసర్ కె.శ్రీనివాస్, జీజీహెచ్ నెఫ్రాలజీ విభాగాధిపతి సీహెచ్ నాగేశ్వరరావు, డా. ఎన్‌టీఆర్ వైద్య సేవ సమన్వయకర్త డా. జె.సుమన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విద్యాసాగర్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

# సునిశిత హాస్యంతో ఆహ్లాదపరచిన నాటికలు

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్**

మనస్సారా హాయిగా నవ్వుకునేలా సందేశాత్మక, సునిశిత హాస్యంతో ఆహ్లాదపరచిన నాటికలు శనివారం కూడా కొనసాగాయి. సిద్ధార్థ కళా పీఠం సౌజన్యంతో సుమధుర కళా నికేతన్ 27వ తెలుగు హాస్య నాటికల పోటీలు, 51వ వార్షికోత్సవం మొగల్‌రాజ్‌పురంలోని పి.బి.సిద్ధార్థ కళాశాల ఆడిటోరి యంలో రెండోరోజు మూడు హాస్య నాటికలు ప్రదర్శిం చారు. హాస్య నాటికలకు కథా బలం తక్కువగా ఉంటుంది. సంఘటనలు, సంభాషణ ఉచ్చారణ, నటన ద్వారా ప్రేక్షకులను నవ్విస్తారు. మనిషి నిరంతర జీవన పోరాటంలో అనేక ఒత్తిళ్ళకు గురవుతున్నాడు. మానసిక ప్రశాంతతకు కళలు దోహదపడతాయి. అందుకే ప్రతి ఒక్కరూ మనోవికాసాన్ని కలిగించే నాటకం, నత్యం, జానపద కళలను ఆదరించాలి, ప్రోత్సహించాలి. పోటీల్లో మొదటి ప్రదర్శనగా ఇవిఎస్ కళా సమితి, విజయవాడ వారు దంత వేదాంతం నాటిక ప్రదర్శించారు. పొరపాటున విషం కలిపిన కాఫీ తామే తాగి ఉంటామని, కుటుంబ సభ్యులు, బంధువులు భయంతో అల్లాడటం, పరీక్షించడానికి వచ్చిన వైద్యుడు కూడా తాను తాగానేమోనని భయపడటం, చివరకు కథ సుఖాంతం కావటం దంత వేదాంతం నాటిక సారాంశం. ఈ నాటికకు చక్కని సంభాషణలు పొందరుపరచగా దర్శకుడు ఈవన రమేష్, బొర్రా నరెన్, కత్తి శ్యాం ప్రసాద్, ఎం నాగరాజు, మల్లేశ్వర పట్నాయక్, భాగ్యరాజ్, జి.సత్యనందిని నటించి హాస్యాన్ని పండించారు. మద్దుకూరి ఆర్ట్ క్రియేషన్స్, చిలకలూరిపేట వారు మా ఇంట్లో మహా భారతం రవీంద్రబాబు రచనను, ఎన్.వెంకటేశ్వరరావు దర్శకత్వంలో ప్రదర్శించారు. నలభై ఎకరాల పొలం ఉన్నా, చదువు, ఉద్యోగం లేని ముప్పై ఆరేళ్ళ వాసుకి ఎవ్వరూ పిల్లనివ్వక పెళ్ళికాదు. దీనిని నవ్వులతో కూడిన దృశ్య నాటికగా కళా కారులు ప్రదర్శించారు. దీనికి నడంపల్లి వెంకటేశ్వర రావు దర్శకత్వం వహించగా, రచయిత మద్దుకూరి రవీంద్రబాబు, ఎస్ జ్యోతి రాణి, డి.శ్రీహరి, పి.పండు, పి.భుజంగరావు, వై.భవాని నటించారు. చివరిగా భద్రం ఫౌండేషన్ వెల్‌ఫేర్ సొసైటీ, విశాఖపట్నం వారి దొందు దొందే నాటికను డేవిడ్ రాజు రచన, దర్శకత్వంలో ప్రదర్శించారు.

### యువతను కళల పట్ల ఆకర్షితులను చేయాలి

నేటి యువత చదువు, ర్యాంకులు, ఉద్యోగం, సంపాదన ధ్యేయంగా అడుగులు వేస్తున్నారు తప్ప, వ్యక్తిత్వ వికాసం, మానసిక ఆనందాన్ని ఇచ్చే కళలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ సిఇఒ ఆర్.మల్లిఖార్జునరావు అన్నారు. యువ పురస్కార సభకు ముఖ్య అతిథిగా మల్లిఖార్జునరావు ప్రసంగిస్తూ నేటి యువత సెల్‌ఫోన్, అంతర్జాలం ఉచ్చులో బిగుసుకు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాగార్జున విద్యా సంస్థ(కొండపల్లి) వ్యవస్థాపకులు దేవినేని కిషోర్ కుమార్ మాట్లాడుతూ కనుమరుగయిపోతున్న కళలను భావితరాలకు అందించాలని సూచించారు. అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం అధ్యక్షులు సామంతపూడి వెంకటేశ్వర రాజు, ప్రముఖ హృద్రోగ నిపుణులు డాక్టర్ ఎ.పూర్ణానందం సందేశాలు ఇచ్చారు. సంస్థ అధ్యక్షులు సామంతపూడి నరసరాజు సభాధ్యక్షుడుగా మాట్లాడతూ రాబోయే కాలంలో తమ సంస్థ యువతకు ప్రాధాన్యతనిస్తూ కార్యక్రమాలు రూపొందిస్తాం అన్నారు. ఈ సభలో ఉన్నత విద్యావంతులు, తమ కళాప్రతిభతో పలువురు మన్ననలు అందుకుంటున్న పి.సాయి శంకర్, బి.రూపాశ్రీలకు శనగల కబీర్ దాస్ స్మారక యువ పురస్కారం అందించి సత్కరించారు.



మా ఇంట్లో మహాభారతం నాటికలోని ఓ సన్నివేశం



## సమన్వయంతో
# మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణ

- క్యూలైన్ల క్రమబద్ధీకరణతోపాటు, ట్రాఫిక్ చిక్కులు లేకుండా జాగ్రత్తలు
- తిరునాళ్ల నేపథ్యంలో కోటప్పకొండ వద్ద పర్యటించిన మంత్రి గొట్టిపాటి

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

మహాశివరాత్రి పర్వదినాన కోటప్పకొండ తిరునాళ్లను అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని రాష్ట్ర మంత్రి, పల్నాడు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో మహాశివరాత్రి తిరునాళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుణాళ్ల ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు. ఆలతయంలో తక్కువ సమయంలో దర్శనం చేసుకుని భక్తులు బయటకు వచ్చేలా క్యూలైన్లను క్రమబద్ధీకరించాలని మంత్రి గొట్టిపాటి సూచించారు. ఎక్కడా భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. వీఐపీలు, వీవీఐపీల దర్శనానికి ప్రత్యేక సమయాలు కేటాయించి ఆ సమయంలో సామాన్య భక్తులకు ఎటువంటి సమస్య లేకుండా చూడాలన్నారు. లక్షలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొండపైకి ఆలయం వద్దకు భక్తులు వెళ్లేందుకు కింద నుండి పైకి వెళ్లేందుకు ఫిట్ నెస్ ఉన్న బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఎంపి లావు శ్రీకష్ణ దేవరాయలు, ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ సిసి కెమెరాలలో ఆలయం లోపల క్యూలైన్లలో, తిరుణాలలో కూడా ప్రత్యేక పర్యవేక్షణతో పాటు ట్రాఫిక్, ఇతర అంశాలపై పరిశీలన ఉండాలని చెప్పారు. పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎక్కడా కూడా అపరిశుభ్రత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తిరునాళ్ల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించినట్లు చెప్పారు.





# కానిస్టేబుళ్లకు ముగిసిన శిక్షణ

## నైపుణ్యత పెంపునకు కృషి : ఎస్పీ

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

కానిస్టేబుళ్ల నైపుణ్యాలకు మెరుగులు దిద్దటమే మానవ వనరుల అభివృద్ధి కేంద్రం ప్రధాన ఉద్దేశమని జిల్లా ఎస్పి సతీష్‌కుమార్ తెలిపారు. పోలీస్ కార్యాలయంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహిస్తున్న మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో శిక్షణ పొందిన మొదటి బ్యాచ్ కానిస్టేబుళ్లకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలోని జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ల నుంచి 30 మందికి ఆరు రోజులుగా వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కంప్యూటర్ విద్యలో ప్రాథమిక అంశాల్లో శిక్షణ ఇచ్చారు. పోలీస్ శాఖా పరమైన ఆన్లైన్ అప్లికేషన్స్, ఆంగ్ల భాషలో నైపుణ్యతకు సంబంధించి ఒక అధ్యాపకునితో శిక్షణ కూడా అందించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లలోని కానిస్టేబుళ్లలో చాలామంది ఉన్నత విద్యను అభ్యసించి, ఎన్నో నైపుణ్యాలు కలిగిన వారు ఉన్నారని తెలిపారు. వారిలోనీ నైపుణ్యాలను వెలికి తీసి, వాటికి మెరుగులు దిద్ది, పోలీస్ స్టేషన్లో వారు అన్ని విధులు నిర్వర్తించే విధంగా తర్ఫీదు ఇచ్చినట్టు తెలిపారు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు రాయడం నుంచి రఫ్ స్కెచ్,ఆధారాల సేకరణ, సాక్షుల వాంగ్మూలాలు రాయడం, చార్జిషీటు తయారు చేయడం, అరెస్టు కార్డు రాయడం వంటి అన్ని పనులను అందరూ నేర్చుకుంటే ఎన్నో కేసుల్లో త్వరగా దర్యాప్తు పూర్తి చేసి, నిందితులకు శిక్ష వేసే అవకాశం ఏర్పడుతుందని చెప్పారు.

# పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు



**ప్రజాశక్తి-గుంటూరు :** 'కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ - గుంటూరు', ది రాజోల్ తాలూకా తెలగా అఫిషియల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాలలో భాగంగా చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 242 మంది పేద విద్యార్థులకు రూ.10.33 లక్షలు ఉపకార వేతనాలుగా పంపిణీ చేయనున్నట్లు తులసి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగీష్ చంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో అయిదు లక్షల ఇరవై అయిదు వేల రూపాయలు తులసి సీడ్స్ వారు కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ ద్వారా 104 మంది పేద విద్యార్థులకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమం మంగేన గంగయ్య తెలగ కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. 'కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ - గుంటూరు', ' శ్రీకష్ణ దేవరాయ కాపు సంక్షేమసంఘం- పాలకొల్లు సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాలలో భాగంగా చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 282 మంది పేద విద్యార్థులకు రూ.12.90 లక్షలు ఉపకార వేతనాలుగా పంపిణీ చేయనున్నారని తెలిపారు. ఇందులో రూ.6.10 లక్షలు తులసి సీడ్స్ వారు 122 మంది పేద విద్యార్థులకు అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమం పాలకొల్లు లయన్స్ క్లబ్ ఆడిటోరియం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమౌతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

### సందర్శకులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

ఈనెల 26న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కోటప్పకొండకు శ్రీ త్రికోటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఆలయ ఈ.ఓ చంద్రశేఖర్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకునేలా అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకష్ణదేవరాయలు, ఎవెత్మ్మల్యే డాక్టర్ అరవిందబాబు, చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు తదితరులు ఏర్పాట్లు పరిశీలించి తగిన సూచనలు చేసినట్లు ఈఓ తెలిపారు.



# కుంభమేళాకు ఆర్టీసీ మరో ప్రత్యేక సర్వీసు

**ప్రజాశక్తి-గుంటూరు**

ఆర్టీసీ గుంటూరు-2 డిపో నుంచి మహాకుంభమేళా(ప్రయాగరాజ్)కు మరో స్పెషల్ బస్ ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ షేక్.అబ్దుల్ సలాం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఈ నెల 11న ఏర్పాటు చేసిన బస్సు నిండిపోవడంతో 15వ తేదీన మరో పుష్‌బ్యాక్ సూపర్ లగ్జరీ బస్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ యాత్ర మొత్తం 8 రోజులు ఉంటుందని తెలిపారు. ఫిబ్రవరి 15న ఉదయం 10 గంటలకు గుంటూరులో బయలుదేరుతుందని.. రెండో రోజు సాయంత్రానికి ప్రయాగరాజ్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు. అయోధ్య, వారణాసిల మీదుగా ఎనిమిదివ రోజు రాత్రికి గుంటూరు చేరుతుందని వివరించారు. ఈ సర్వీస్‌కు 91927 ఆన్‌లైన్ సర్వీస్ నంబర్ ద్వారా రిజర్వేషన్ చేసుకొనే అవకాశం ఉందని, యాత్రికులు వినియోగించుకోవాలని కోరారు. ఒక్కో టికెట్ ధర రూ.8,300లు మాత్రమేనని తెలిపారు. వివరాలకు 73828 97459, 73828 96403 నంబర్లను సంప్రదించాలని కోరారు.

# బైక్ కనిపిస్తే.. మాయమవ్వాల్సిందే!

- వివిధ కేసుల్లో ఇద్దరు అరెస్ట్
- మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

**ప్రజాశక్తి- మాచర్ల**

ద్విచక్ర వాహనాలను తస్కరించడంలో వారు సిద్ధహస్తులు. కన్ను పడిందంటే.. బండి మాయమవ్వాల్సిందే. తెలంగాణ ప్రాంతం నుంచి ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులు ఎట్టకేలకు పోలీసులకు చిక్కారు. మాచర్ల పోలీసులు వీరిని శనివారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మూడు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్ఐ నరసింహారావు తెలిపారు. కొండమల్లేపల్లికి చెందిన పి.వెంకటేష్, డొక్క రమేష్‌లు బైక్ దొంగతనాలు చేయడంలో సిద్ధహస్తులు. వీరిపై పలు చోట్ల కేసులు కూడా నమోదయ్యాయి.

ఇటీవల మాచర్లలో మూడు ద్విచక్ర వాహనాలు చోరీ చేసి, తరలించేందుకు ప్రయత్నిస్తుండగా మాచర్ల పోలీసులు వల పన్ని పట్టుకున్నారు. సాగర్ రోడ్డులోని ఇంగ్లీష్ మీడియం స్కూల్ సమీపంలో వీరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేశారు. నిందితులను పట్టుకోవడంలో హెడ్ కానిస్టేబుల్ ప్రభుదాసు, అశోక్ చాకచక్యంగా వ్యవహరించినట్లు ఎస్ఐ నరసింహారావు తెలిపారు.



## నాగార్జున కొండను సందర్శించిన పలు దేశాల బౌద్ధ భిక్షువులు

**ప్రజాశక్తి - విజయపురిసౌత్ :** ప్రపంచ ప్రఖ్యాత బౌద్ధ క్షేత్రమైన నాగార్జున కొండను అంతర్జాతీయ బౌద్ధ భిక్షువులు శనివారం సందర్శించారు. అక్కడి కట్టడాలు, శిల్పాలను వారు సందర్శించి కొనియాడారని పురావస్తు పరిశోధకులు, ప్లీజ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో, బుద్ధవనం కన్సల్టెంట్ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. నాగార్జునసాగర్‌లోని బుద్ధ వనంలో జరిగిన అంతర్జాతీయ త్రిపిటక పఠనోత్సవానికి వచ్చిన మన దేశానికి చెందిన 27 మంది, శ్రీలంక, మయన్మార్ కంబోడియా, లావోస్, థాయిలాండ్, వియత్నాం లాంటి దక్షిణ ఆసియా దేశాల నుంచి వచ్చిన 88 మంది బౌద్ధ బిక్షువులకు నాగార్జున కొండలోని బౌద్ధ ప్రదర్శనశాల, పునర్ నిర్మించిన బౌద్ధ కట్టడాలను శివనాగిరెడ్డి చూపించి వివరించారు. బౌద్ధ ప్రదర్శనశాలలోని శిల్పాల గురించి మ్యూజియం అధికారి కమలహాసన్ వివరించగా బౌద్ధ బిక్షువులు ఆసక్తిగా ఆలకించి ఆచార్య నాగార్జునడు నడయాడిన నేలపై తామూ అడుగు పెట్టడం తమకెంతో ఆనందాన్నిచ్చిందని సంతోషం వెలిబుచ్చారు. ఆచార్య నాగార్జునుని రచనలు ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందాయని ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో బుద్ధవనం అధికారులు డిఆర్ శ్యాంసుందర్రావు, డాక్టర్ రవిచంద్ర పాల్గొన్నారు.


చరిత్రను వివరించిన పురావస్తు పరిశోధకులు ఈమని శివనాగిరెడ్డి

## రాష్ట్రపతికి అంగన్వాడీల లేఖలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు జాతీయ స్థాయి పిలుపులో భాగంగా భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో లేఖలు రాశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ, ఐసిడిఎస్‌కు నిధులు పెంపు, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలని లేఖలో కోరారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు కెపి.మెటిల్డాదేవి, జి.మల్లీశ్వరి మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగక అంగన్వాడీలు ఇబ్బందులు పుగున్నారని, మాత, శిశు సంరక్షణకు విశేష సేవలందిస్తున్న వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ట్రెజరర్ ఎ.లక్ష్మీప్రసన్న, సాయికుమారి, సుజాత, శ్రీదేవి, పద్మావతి, అమల పాల్గొన్నారు.



# ఇంటి దగ్గర చదువుపైనా వాకబు

- ఇంటర్మీడియట్ విద్యార్థుల ఉత్తీర్ణత పెంపుపై ప్రత్యేక దృష్టి
- సామర్థ్యం అధారంగా బృందాలుగా ఏర్పాటు - అధ్యాపకులకు వ్యక్తిగత బాధ్యత
- వచ్చే నెల ఒకటో తేదీ నుండి 20 వరకు ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్యార్థికి ఇంటర్మీడియట్ విద్య కీలక దశ. ఇక్కడే అధిక సంఖ్యలో విద్యార్థులు వెనుకబడిపోతుంటారు. ఈ పరిస్థితిని అధిగమించి ఉత్తమ ఫలితాల సాధనకు రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు ప్రత్యేక దృష్టి పెట్టింది. విద్యార్థుల హాజరుతో పాటు వ్యక్తిగత ప్రమాణాలను పెంచేలా చర్యలకు ఉపక్రమించింది. ఈ విద్యా సంవత్సరం పల్నాడు జిల్లాలోని 48 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి ఏడాది 17905 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 14529 మంది ఉన్నారు. వీరితో పాటు మరో 2117 మంది వచ్చేనెల 3 నుంచి 15 వరకూ ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలు రాయనున్నారు. 9 కేంద్రాల్లో ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి.

### పాఠ్యాంశాల వారీగా విద్యార్థుల సామర్థ్యంపై అంచనా

ఇంటర్మీడియట్ మొదటి ఏడాది విద్యార్థులకు మార్చి 1 నుంచి 19 వ తేదీ వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మార్చి 3 నుంచి 20వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షలకు 20 రోజుల సమయం ఉండడంతో అధ్యాపకులు పాఠ్యాంశాల వారీగా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారు. ప్రస్తుత నెలలో పరీక్షలు నిర్వహించి ప్రతి విద్యార్థి స్థాయిని అంచనా వేయనున్నారు. వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

జిల్లాలోని 9 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులను బృందాలుగా విభజించి, ఒక్కో బృందం బాధ్యతలను ఒక్కో అధ్యాపకుడితో అనుసంధానం చేశారు. విద్యార్థులు రోజూ కళాశాలకు వచ్చేలా, అన్ని పాఠ్యాంశాల్లో ఉత్తీర్ణత సాధించేలా చేయడం ఆ అధ్యాపకుడిదే బాధ్యత. ఇందులో భాగంగా కళాశాలలోనే కాకుండా ఇంటికి వెళ్లిన తర్వాత చదువుకునేలా ఉదయం త్వరగా నిద్రలేచేలా చూస్తున్నారు. ఆ సమయంలో చదువుకుంటున్నారా? లేదా అనే అంశాన్ని సెల్‌ఫోన్ ద్వారా వాకాబు చేస్తున్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండడంతో పాటు మత్తు పదార్థాల వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకోసం ప్రతి కళాశాలలో ఒక అధ్యాపకుడిని కౌన్సిలర్‌గా నియమించారు.



### సంకల్ప్ కార్యక్రమం..

ప్రతి జూనియర్ కళాశాలలో ఉత్తీర్ణత పెంచేందుకు 'సంకల్ప్' కార్యక్రమాన్ని అమలు చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యం, అక్టోబర్‌లో నిర్వహించిన పరీక్షల్లో మార్కుల ఆధారంగా ఎ, బి, సి కేటగిరీలుగా విభజించారు. హాఫ్ ఇయర్లీ, ప్రీ ఫైనల్స్ మార్కుల ఆధారంగా వారి కేటగిరీల్లో కూడా మార్పులు చేస్తారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రాపౌట్ శాతాన్ని తగ్గించేందుకు ఈ ఏడాది ఆరంభం నుండి డొక్కా సీతమ్మ మధ్యహ్న భోజన పథకం ప్రారంభించారు.

### గతేడాది ఫలితాలిలా..

గతేడాది మొదటి సంవత్సరం 13651 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 78 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఒకేషనల్ విద్యార్థులు 721 మంది హాజరుకాగా 68 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 12620 మందికి గాను 96 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ అభ్యర్థులు 564 మంది కాగా 80 శాతం ఉత్తీర్ణత సాదించారు.

### పరీక్షల నిర్వహణపై కలెక్టర్ సమీక్ష

ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఒక హెల్త్ అసిస్టెంట్‌ను అందుబాటులో ఉంచాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే ఏ పరీక్షా కేంద్రాకైనా చేరుకునే విధంగా కీలక ప్రాంతాల్లో మెడికల్ వ్యాన్లను సిద్ధంగా ఉంచాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారులను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఇటీవల సమీక్షలో ఆదేశించారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా బస్సులు నిర్వహించాలని ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి నుంచి పరీక్షలు పూర్తయ్యే వరకు విద్యార్థులు తప్పనిసరిగా కళాశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. గైర్హాజరవుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలని, ప్రతి విద్యార్థిపై దృష్టి పెట్టాలని డీఐఈఓ జిల్లాలోని ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలల ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు.

### 90 శాతం ఉత్తీర్ణతకు కృషి

జిల్లాలో ఉత్తీర్ణత శాతం పెంచాలనే లక్ష్యంతో ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. ఉన్నతాధికారుల సూచనలతో సంకల్ప్ కార్యక్రమం ప్రతి కళాశాలలో అమలయ్యేలా చర్యలు చేపడుతున్నాం. కాలేజీలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి అక్కడి పరిస్థితులను పరిశీలిస్తున్నాం. ప్రభుత్వ కళాశాలల్లో సరైన బోధన, శిక్షణిచ్చి 90 శాతం ఉత్తీర్ణత పెంచేందుకు కృషి చేస్తున్నాం. జిల్లా కేంద్రం నరసరావుపేటలో రానున్న విద్యా సంవత్సరం నాటికి ఒక ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల, ఒక ప్రభుత్వ ఒకేషనల్, ప్రభుత్వ బాలుర కళాశాలలో మొత్తం 3 కళాశాల మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు నివేదించాం.

**ఎం.నీలావతిదేవి, పల్నాడు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి.**

# మేం గెలిచాక నువ్వెక్కడ దాక్కున్నా లాక్కొస్తా...

## ఎమ్మెల్యే పుల్లారావుకు మాజీ మంత్రి రజిని హెచ్చరికలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పుల్లారావు.. గుర్తు పెట్టుకో.. మళ్లీ అధికారంలోకి వస్తాం.. నువ్వెక్కడికి పారిపోయి దాక్కున్నా లాక్కొచ్చి వడ్డీతో సహా చెల్లిస్తా.. అని మాజీ మంత్రి విడుదల రజిని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. స్థానిక ఎన్‌ఆర్‌టి సెంటర్‌లోని తన నివాసంలో శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు.. కట్టుకథ అల్లి తనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు పెట్టించారని, తనతోపాటు తన కుటుంబంపై కక్షపూరితంగా అక్రమ కేసులు పెట్టిస్తున్నారని అన్నారు. 80 ఏళ్ల తన మామ, విదేశాల్లో ఉంటున్న తన మరిదిపై అక్రమ కేసులు పెట్టారని చెప్పారు. తనది పురుషోత్తమపట్నమేనని, తనతోపాటు పుల్లారావుకూ కుటుంబం ఉందనే విషయం గుర్తుపెట్టుకోవాలని హితవు పలికారు. తన కుటుంబం జోలికి, కార్యకర్తలు, నాయకుల జోలికి వచ్చినా సంహించే ప్రసక్తే లేదన్నారు. అవినీతిలో ఘనాపాటి అయిన పుల్లారావు 2019లో ఒక ఘటన జరిగిందంటూ తనపై అట్రాసిటీ కేసు నమోదు చేయించారని, పైగా హైకోర్టు నమోదు చేయమందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. 2014 నుంచి 2019 వరకు పుల్లారావు చేసిన అరాచకాలు, అక్రమాలు, అన్యాయాలపై తాను దృష్టి పెట్టి ఉంటే ఆయన ఎక్కడుండే వాడో నని అన్నారు. తమ పాలనలో అభివృద్ధిపై దృష్టి పెడితే ఇప్పుడు అరాచకంపై దృష్టి పెట్టారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చిలకలూరిపేటలో పేకాట, అక్రమ మైనింగ్, సెటిల్మెంట్లు, అన్యాయాలు, అక్రమాలకు కేరాఫ్‌గా మారిందన్నారు.



# అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు

## తన్మయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పట్టణంలోని ఏనుగుల బజారులో నూతనంగా ఏర్పాటు చేసిన తన్మయి సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ ప్రారంభించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ వైద్య సేవలు కోసం వచ్చే అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి డాక్టర్స్ సెల్ ఉపాధ్యక్షులు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్, మాజీ కౌన్సిలర్ నాగజ్యోతి, హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, టిడిపి నాయకులు పాల్గొన్నారు.


తన్మయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

## పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావును గెలిపించాలని ప్రచారం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

నిడమర్రు చారువాక ఆశ్రమంలో శనివారం నాడు జరిగిన నాస్తిక మేళాలో పట్టభద్రులకు కరపత్రాలు అందజేస్తున్న సిఐటియు రాజధాని నేత ఎం రవి ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేసే కె.ఎస్ లక్ష్మణరావు కృష్ణ, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని లక్ష్మణరావును ఉద్యోగ ఉపాధ్యాయ ప్రజా సంఘాలు బలపరుస్తున్నాయని అన్నారు. సమస్యల పట్ల సమగ్ర అవగాహన కలిగిన వ్యక్తి లక్ష్మణరావు అని ప్రజా పోరాటాలకు అండగా నిలుస్తున్న లక్ష్మణ్ రావు ని గెలిపించాలని రవి కోరారు. సోమవారం గుంటూరులో జరిగే కె ఎస్ లక్ష్మణరావు నామినేషన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గిరబోయిన నాగేశ్వరరావు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కట్టపోగు బుల్లి అబ్బాయి తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్సీ ఎన్నికల్లో కెఎస్ లక్ష్మణరావును గెలిపించండి

## రేపటి నామినేషన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రజా సంఘాల పిలుపు

**ప్రజాశక్తి, పెదనందిపాడు**

గుంటూరులో ఈనెల 10వతేదీన నిర్వహించే కె.ఎస్. లక్ష్మణరావు నామినేషన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయా లని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు విజ్ఞప్తి చేశారు. శనివారం పెదనందిపాడులోని తేళ్ల నారా యణ విజ్ఞాన కేంద్రంలో ప్రజా సంఘాల సమావేశం రైతు సంఘం నాయకులు కొత్త వెంకటశివరావు అధ్యక్షతన జరి గింది. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ ఈనెల 27వ తారీఖు ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో అన్ని ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థిగా కెఎస్. లక్ష్మణరావు పోటీ చేస్తున్నారని తెలి పారు. లక్ష్మణరావు ఉద్యోగ, ఉపాధ్యాయ, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, రైతు, ప్రజా సమస్యల మీద నిరంతరం శాసన మండలి, ప్రజా వేదికలపై వారి గళాన్ని వినిపిస్తున్న విష యాన్ని తెలియజేశారు. లక్ష్మణరావు గెలుపు ప్రజల గెలుపని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో నల్లమడ వాగు ఆధునీకరణ పనులు కొరకు, గుంటూరు ఛానల్ పొడిగింపు కోసం జరిగిన రైతాంగ పోరాటాలలో పాల్గొని సమస్యలను మం డలిలో లేవనెత్తారని తెలిపారు. ముఖ్యమంత్రులకు, ప్రభుత్వ ఉన్నత అధికారులకు ఈ సమస్యల మీద అనేకసార్లు వినతి పత్రాలు అందజేసి రైతులకు సంఘీభావంగా నిలిచారని తెలి పారు. ప్రభుత్వంలో జరిగిన అంగన్వాడీల పోరాటం, ఇతర కాంట్రాక్టు ఉద్యోగులు జరిపిన పోరాటాలలోను ముందుండి వారి సమస్యల పరి ష్కా రం కొరకు పని చేశారని తెలిపారు. మన జిల్లాలోని వివిధ సమస్యల మీద కూడా జిల్లా పరిషత్ సమావేశంలో లేవనెత్తి ప్రజాభిప్రాయాన్ని తెలియజేశారు అన్నారు. ప్రభుత్వం ఏదైనా నిర్మాణాత్మక ప్రతిపక్షంగా పని చేస్తూ, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న లక్ష్మణరావును గెలిపిం చు కోవాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. 10వ తారీకు సోమవారం నామినేషన్ సందర్భంగా వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఉదయం 10 గంటలకు సభ జరుగుతుందని, అనంతరం సభా ప్రాంగణం నుండి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ప్రదర్శనతో వెళ్లి నామినేషన్ వేయడం జరుగు తుందని తెలియ జేశారు. నామినేషన్ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు నాయకులు దొప్పల పూడి రమేష్ బాబు, విశ్రాంత ఉపాధ్యాయ సంఘం నాయ కులు గారపాటి రమేష్ మాట్లాడుతూ ప్రజా నాయకుడు లక్ష్మణ రావును గెలిపించుకోవలసిన ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయ సంఘం నాయ కులు జంపని రామారావు, రైతు సంఘం నాయకులు పోపూరి సుధీర్, గద్దె మల్లేశ్వరరావు, తలారి కిషోర్, మహిళా సంఘం నాయకులు మర్రి లక్ష్మి, షేక్ షమీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

### లక్ష్మణరావుకు మద్దతుగా ప్రచారం

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఈనెల 27న జరగ నున్న పట్టభద్రుల ఎన్నికల్లో పోటీ చేస్తున్న, ప్రజా సం ఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్.లక్ష్మణరావును గెలి పించాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం మండలంలో ప్రచారం నిర్వహించారు. అన్నవరం, పరిటాలవారిపాలెంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజల మనిషి లక్ష్మణరావు గెలుపునకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయ కులు డి.రమేష్‌బాబు, జంపని రామారావు పాల్గొన్నారు.

## సైబర్ భద్రతపై విఐటిలో జాతీయ హ్యాకథాన్ ఎక్స్

**ప్రజాశక్తి - తుళ్లూరు**

ఎఐసిటిఈ, ఎన్సిఎస్సిఆర్ సంయుక్త సహకారంతో రాజధాని అమరావతిలోని విఐటి విశ్వవిద్యాలయంలో సైబర్ భద్రతా సవాళ్లపై శనివారం ఢిల్లీలోని నేషనల్ సైబర్ భద్రతా పరిశోధన మండలి, ఎఐసిటిఈ సహకారంతో జాతీయ స్థాయి హ్యాకథాన్ ఎక్స్‌ను విజయవం తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమాచార భద్రతరంగంలో వినూత్న పరిష్కా రాలను చర్చించడానికి, అభివృద్ధి చేయడానికి సైబర్ భద్రతా ఔత్సాహికులు, నిపుణులు, విద్యావేత్తలు సమావేశమయ్యారు. కార్యక్రమా నికి ముఖ్యఅతిథిగా విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు, హాజరయ్యారు. ఆయన మాట్లా డుతూ బలమైన సైబర్ భద్రతా చట్టాల ఆవశ్యకత గురించి వివరించారు. హ్యాకథాన్ ఎక్స్‌లాంటి కార్యక్రమాలు సైబర్ భద్రతా సవాళ్లను సమర్థవంతంగా పరిష్కరించ డానికి దోహదపడతాయన్నారు. విద్యార్థులలో సాంకేతిక నైపు ణ్యాన్ని పెంపొందించడంలో విఐటి విశ్వవిద్యాలయం చేస్తున్న కృషిని ప్రశంసించారు. గౌరవ అతిథి షేక్ అహ్మద్ (ఎన్సిఎస్సిఆర్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ గౌరవ సలహాదారు - న్యూఢిల్లీ) మాట్లాడుతూ సైబర్ స్థితిస్థాపకతను బలోపేతం చేయడంలో సహకార ప్రయ త్నాల ప్రాముఖ్యతను గురించి తెలిపారు. సైబర్ సెక్యూరిటీ వ్యక్తిగత ప్రయత్నం కాదు, సమిష్టి బాధ్యత అని వ్యాఖ్యా నించారు. ఇటువంటి కార్య క్రమాలలో విద్యార్థులు పాల్గొనడం జాతీయ సైబర్ సెక్యూ రిటీ పురోగతికి ఎంతో దోహదపడుతుందని ఆయన అన్నారు. డాక్టర్ ఖలీరాజ్ (డైరెక్టర్ -నేషనల్ సైబర్ సెక్యూరిటీ రీసెర్చ్ కౌన్సిల్) మాట్లాడుతూ, సైబర్ సెక్యూరిటీ ధోరణులు, సాంకేతిక పురోగతిపై విలువైన సూచనలు చేసారు. సైబర్ సెక్యూరిటీ భవిష్యత్తును రూపొందించగల సంచలనాత్మక ఆలోచనలకు హ్యాకథాన్ ఒక వేదికగా పని చేస్తుందని అన్నారు. ఈ రంగంలో విద్యార్థులు తమ ప్రయత్నాలను కొనసాగించాలన్నారు. విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స లర్ డాక్టర్ ఎస్.వి. కోటరెడ్డి మాట్లాడుతూ సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొం దించడంలో విశ్వవిద్యాలయం నిబద్ధత గురించి మాట్లా డారు. హ్యాకథాన్లో పాల్గొనేవారిని స్వాగతించారు. రాష్ట్రం లోని వివిధ విద్యాసంస్థల నుండి 100 బృందాలు, 300 మంది విద్యార్థులు జాతీయ స్థాయి హ్యాకథాన్‌ఎక్స్‌కి హాజరయ్యారని తెలియజేశారు. కార్య క్రమంలో కె.ధవూర్యన్ నాయక్ (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఐటి ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ విభాగం డైరెక్టర్), పి శ్రీనివాసులు (మేనేజర్, ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్), డా॥ జగదీష్ చంద్ర ముదిగంటి (విఐటి విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్), డాక్టర్ ఖదీర్ పాషా (డిప్యూటీ డైరెక్టర్-స్టూడెంట్ వెల్ఫేర్),డాక్టర్ సయ్యద్ హుస్సేన్ (కోఆర్డి నేటర్), విద్యార్థులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు



చిత్రం ట్రైలర్ వీక్షిస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి, డాక్టర్ చదలవాడ

## భక్తులకు కానుకగా కోటప్పకొండ చిత్రం

**ప్రజాశక్తి-తెనాలిరూరల్**

మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు అందిస్తున్న కానుక 'కోటప్పకొండ' సినిమా అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. నరసరావుపేట శాసన సభ్యులు డాక్టర్ అరవింద్ బాబు సమర్పణలో తెనాలి యువదర్శకులు నరేష్ దోనే, మణివరన్ దర్శక త్వంలో పూర్తిగా ఆంధ్రాలోనే చిత్రీకరించిన తొలి ఓటిటి సినిమా' కోటప్పకొండ ట్రైలర్‌ను ఆయన శనివారం కోటప్ప కొండ సమీపంలో వీక్షించారు. కోటప్పకొండ స్థల పురా ణం ఆధారంగా రూపొందించిన ఈచిత్రం చూశాక త్రికూటాద్రికి పరమేశ్వరుడు ఎందుకు కోటప్పకొండగా నామ కరణం చేశారో భక్తులు తెలుసుకుంటారన్నారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు మాట్లా డుతు భక్తుల వీక్షించే విధంగా ఎల్‌ఈడి స్క్రీన్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చిత్రం ద్వారా భక్తులకు కోటప్ప కొండ క్షేత్ర మహిమలు తెలుసుకోగలరని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవ రాయలు మాట్లాడుతూ కోటప్పకొండ చరిత్రకు ఈ చిత్రం తొలి సంతకమని దర్శకులను అభినందించారు. కార్యక్రమ ంలో శివ, ఈదర సాంబశివరావు, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

## రేపటి నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

**ప్రజాశక్తి-గుంటూరు**

జిల్లాలో ఈనెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులకూ అల్బెండజోల్ మాత్రలు మింగించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక ఒక ప్రకటనలో కోరారు. నులి పురుగు నివారణ గురించి పాఠశాల అసెంబ్లీలో చర్చించా లన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యా శాఖ అధికారులు, తమ పరిధిలో ఎఎన్ఎం గానీ, మెడికల్ ఆఫీసర్ల సమన్వయంతో మాత్రుల పొంది, 10వ తేదీ మధ్యాహ్నం భోజనం తీసుకున్న 30 నిముషాల తర్వాత మాత్రలు మింగించాలన్నారు. ఎవరైనా ఆరోజు గైర్హాజరైతే ఈనెల 17న పంపిణీ చేయాలన్నారు. మండల విద్యా శాఖాధికారులు నోడల్ అధికారులుగా వ్యవహరించి ఆ మండలంలో అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులు మాత్రలు తీసుకునే విధంగా పర్యవేక్షించాలన్నారు.

## భద్రావతి సమేత భావనాఋషి స్వామి కళ్యాణం మహోత్సవ బ్రోచర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి - మంగళగిరి**

కొత్త మంగళగిరిలోని నాంచారమ్మ ప్రాంగణంలో వేంచేసి ఉన్న శ్రీ భద్రావతి సమేత భావన ఋషిస్వామి వార్ల కళ్యాణ మహోత్సవం మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన జరుగుతుందని పట్టణ పద్మశాలియ బహుత్తమ సంఘం నాయకులు శనివారం తెలిపారు. ఈ మేరకు కళ్యాణ మండ పం ఆవరణలో శుభ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్య క్రమంలో సంఘం అధ్యక్షులు చింతక్రింది కనకయ్య, ఉపాధ్య క్షులు గుత్తికొండ ధనుంజయరావు, ప్రధాన కార్యదర్శి దామర్ల కుబేరస్వామి, కోశాధికారి గంజి రవీంద్రనాథ్, సహా య కార్యదర్శి మునగపాటి వెంకటేశ్వరరావు, రామనాథం పూర్ణచంద్రరావు, వంగర లక్ష్మయ్య, కొల్లి ప్రసాదు, సభ్యులు సందుపట్ల భూపతి,దామర్ల మోహన్,కొల్లి శివాజీ ,దామర్ల కనక లింగేశ్వరరావు, నందం బాబురావు, వెనిగళ్ళ హను మంతరావు, కొల్లి వేణు పాల్గొన్నారు.



విజేతలతో ఉర్దూ డిఐ ఖాసిం, రామ్మోహనరావు తదితరులు

## అందమైన చేతిరాతతో జీవితాన్నే మార్చుకోవచ్చు

**ప్రజాశక్తి-గుంటూరు**

రాష్ట్రస్థాయి హ్యాండ్ రైటింగ్ పోటీలు వి.రామ్మోహన్రావు, క్యాలిగ్రఫీ టీమ్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ కాలేజి ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. దాదాపు 500 మంది పాఠశాల విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. పోటీలలో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులుగా నగదును అందచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉర్దూ డిఐ ఎం.డి ఖాసీం మాట్లాడుతూ చేతిరాత నైపుణ్యాలను పెంచుకోవడం ద్వారా మన జీవితాలనే మార్చుకోవచ్చన్నారు. కృషితో అందమైన చేతిరాత అందరికీ సాధ్యమే అని క్యాలిగ్రఫీ టీం ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిరూపించిందని తెలిపారు. పలు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎందరో ఉపా ధ్యాయులకు, విద్యార్థులకు చేతిరాత నైపుణ్యాలు అభివృద్ధి చేయ టంలో దోహదపడ్డారని కొనియాడారు. కార్యక్రమ నిర్వాహకులు వి.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కాలిగ్రఫీ శిక్షణ కార్యక్రమాలను ఉపయోగించుకొని తమ చేతిరాత నైపుణ్యాలను పెంపొందించు కోవాలని కోరారు. అనంతరం విజేతలకు బహు మతులు అందజేశారు.



వేడుకలను ప్రారంభిస్తున్న డాక్టర్ రవికాంత్ కొంగర తదితరులు

## ఆచరణాత్మక కృషితో విజయాలు

**ప్రజాశక్తి-గుంటూరు**

మీ ఆలోచనలకు ఆచరణాత్మకంగా సరైన కృషి తోడైతే జీవి తంలో గొప్ప విజయాలు సాధిస్తారని ప్రముఖ వైద్యులు, గ్యాస్ట్రో అండ్ బెరియాట్రిక్ సర్జన్ డాక్టర్ రవికాంత్ కొంగర అన్నారు. శనివారం భాష్యం బ్లూమ్స్ విబిసి క్యాంపస్‌లో హుప్లా పేరిట రెండ్రోజులపాటు నిర్వహించిన కల్చరల్ డే వేడుకల్లో రెండో రోజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నేటి యుగంలో సోషల్ మీడియా ప్రభావం పిల్లలపై తీవ్రంగా ఉంటోందని, ఏది మంచి, ఏది చెడు అన్న విచక్షణతో మెలగా లని విద్యార్థులకు సూచించారు. మీలోని ఆలోచనలు కార్య రూపం దాల్చినప్పుడు గొప్ప అద్భుతాలు సాధ్యపడతాయన్నారు. భాష్యం బ్లూమ్స్ పూర్వ విద్యార్థి డాక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ భాష్యం బ్లూమ్స్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. భాష్యం విద్యాసంస్థల వైస్‌చైర్మన్ భాష్యం హనుమంతరావు మాట్లాడుతూ భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ ఎంతోమంది విద్యార్థులను స్నేహపూర్వకంగా కలుపుకొనిపోతూ వారి అవసరాలను గుర్తిస్తూ విద్యాపరంగా సహాయ సహకా రాలు అందించడంతో వారు ఇప్పుడు భాష్యం బాధ్యతలను చేప ట్టి ముందుకు నడిపించడం అభినందనీయమన్నారు. భాష్యం మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్‌రామ్ మాట్లాడుతూ భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ చదువుతోపాటు క్రీడల పట్ల ప్రత్యేక దష్టిసారించారన్నారు. సభకు భాష్యం మెడెక్స్ కళా శాల ప్రిన్సిపాల్ హరిబాబు అధ్యక్షత వహించారు. అనంతరం అతిథులు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా భాష్యం బ్లూమ్స్ పూర్వ విద్యార్థి హరికృష్ణ తండ్రి జోగేశ్వరరావును భాష్యం హనుమంతరావు సత్కరించారు. కార్యక్రమంలో భాష్యం బ్లూమ్స్ ప్రైమరీ క్యాంపస్ ప్రిన్సిపాల్ కవిత, సెకండరీ క్యాంపస్ ప్రిన్సిపాల్ గిరిజారాణి పాల్గొన్నారు. భాష్యం బ్లూమ్స్ జెడ్ఈఓ వరలక్ష్మి పర్యవేక్షించారు.



## విద్యార్థుల్లో స్నేహభావం అవసరం

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

కళాశాలలో నూతనంగా చేరిన విద్యార్థుల పట్ల సీనియర్లు స్నేహపూర్వక వాతావరణంలో మెలగాలని చెన్నుపాటి ఇండో అమెరికన్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాల కార్యదర్శి చెన్నుపాటి సత్యనారాయణ అన్నారు. నరసరావుపేట మండలంలోని జొన్నలగడ్డ గ్రామ పరిధిలో ఉన్న చెన్నుపాటి ఇండో అమెరికన్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి విద్యార్థులు తక్కువ వ్యవధిలో తమ కాళ్లపై తాము నిలిచేలా.. ఫార్మసీ రంగంలో ఉన్నతంగా స్థిరపడేందుకు ఫార్మసీ విద్య భరోసానిస్తుందన్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన అసిస్టెంట్ డైరెక్టర్ డ్రగ్ కంట్రోలర్ విజయరాజు, కోట అనిల్ కుమార్ వాగ్దేవి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు కమ్యూనికేషన్స్ స్కిల్స్ పెంపొందించుకోవాలని.. చదువుతో పాటు క్రమ శిక్షణ కలిగి ఉండాలన్నారు. అనంతరం వివిధ ఆటల పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ఏఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలి

**ప్రజాశక్తి- మాచర్ల రూరల్**

మాచర్ల పరిసర ప్రాంతాల్లో పరిశ్రమలు స్థాపించేందుకు పారిశ్రామిక వేత్తలు, వ్యాపారులు ముందుకు రావాలని మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు. శనివారం మాచర్ల మండల పరిధిలోని రాయవరం అడ్డరోడ్డు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన కందిపప్పు మిల్లును ఎమ్మెల్యే జూలకంటి ప్రారంభించి మాట్లాడారు. మన ప్రాంతంలో కంది, మిరప, పత్తి పంటలు అధికంగా సాగు అవుతున్నాయన్నారు. ఈ ప్రాంతంలో కంది మిల్లులు, కోల్డు స్టోరేజిలు, జూట్ మిల్లులు ఏర్పాటు చేస్తే వ్యాపారులకు లాభదాయకంగా ఉంటుందన్నారు.

## చిత్తడి నేలలను రక్షిద్దాం..

**ప్రజాశక్తి - మాచర్ల**


నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో ప్రపంచ చిత్తడి నేల దినోత్సవంలో భాగంగా శనివారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో చిత్రలేఖనం, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి అల్లి సురేష్ మాట్లాడుతూ చిత్తడి నేలలు నీటిని శుద్ధి చేసి మంచినీటి లభ్యతను పెంచుతాయని, వాతావరణం మార్పులను నియంత్రిస్తాయని, వర్షపు నీటిని నిలువ చేస్తాయని, జీవ వైవిధ్యానికి ఆశ్రయం కలిగిస్తాయని తెలిపారు. చిత్తడి నేలలను రక్షించి, పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ ఆయేషా సుల్తానా, పాఠశాల హెచ్ఎం షేక్ షకీనా తదితరులు పాల్గొన్నారు.



# మట్కా.. మస్కా!

**ప్రజాశక్తి - వినుకొండ**

మట్కా(బ్రాకెట్) జూదం మత్తు పేదల జీవితాలను చిన్నాభిన్నం చేస్తోంది. మట్కా జూదానికి ఒకసారి బానిసగా మారితే.. అది పూర్తిగా నాశనం చేసే వరకూ విడవదు. వినుకొండ పట్టణంలో కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్న మట్కా మత్తులో అనేక మంది యువకులు తమ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఒక్క రూపాయి పెట్టుబడితో 80 రూపాయలు వస్తాయనే ఆశ వారిని మట్కాకు వ్యసనపరులుగా చేసి ఆర్థికంగా దిగజార్చుతోంది. గతంలో పలు మార్లు పోలీసులు మట్కా (బ్రాకెట్)జూదంపై దాడులు నిర్వహించి.. నిర్వాహకులపై కేసులు నమోదు చేసినప్పటికీ.. ఈ జూదం మాత్రం యథేచ్ఛగా సాగుతూనే ఉంది.



- యువత జీవితాలను నాశనం చేస్తున్న బ్రాకెట్

**ఏమిటీ మట్కా..**

మట్కా అనేది ఒక జూదం.. ఇది ముంబయి కేంద్రంగా నడుస్తోంది. అనేక కంపెనీల పేర్లతో ఈ జూదాన్ని నిర్వహిస్తుంటారు. లాటరీ వాళ్లే నిర్వహించే ఈ మట్కా జూదం ఉచ్చులో ఒకసారి పడితే దానిని వదిలించుకోవడం చాలా కష్టం. కేవలం రూ.1 కడితే రూ.80 వస్తుందనే ఆశతో ఈ తరహా జూదానికి ఎక్కువ మంది వ్యసనపరులుగా మారుతుంటారు. 1 నుంచి 9 అంకెల వరకు బెట్టింగ్ పెట్టాల్సి ఉంటుంది. ఆ నంబరు తగిలితే వెంటనే గెలిచిన సొమ్మును మట్కా నిర్వహకులు బెట్టింగ్ రాయుళ్లకు అందిస్తుంటారు. ఉదయం తొమ్మిది గంటలకు, రాత్రి 12 గంటలకు ఒకసారి వీటికి సంబంధించిన ఫలితాలు వస్తుంటాయి. స్థానికంగా ఉండే ఏజెంట్లు ముందుగా బెట్టింగ్ డబ్బులు కలెక్ట్ చేసుకుంటూ రిజల్ట్స్ వచ్చాక ఎవరికైతే నంబరు వస్తే వారికి డబ్బులు చెల్లిస్తుంటారు. ఇదంతా ముంబయి కేంద్రంగా నడుస్తోంది. వినుకొండ పట్టణంలో వీధికొకరు బ్రాకెట్ ఏజెంట్లు ఉన్నారు. బ్రాకెట్ మట్కా జూదం ఆన్‌లైన్ ద్వారా నడుస్తుంది. రాష్ట్రంలో మట్కా జూదం నిషేధంలో ఉన్నప్పటికీ.. వినుకొండలో బ్రాకెట్ ఏజెంట్లు సెల్ ఫోన్ ద్వారా ఆన్లైన్లో బుకింగ్ చేయించి జూదం జోరుగా నడుపుతున్నారు. ఇది పేద, మధ్య తరగతి కుటుంబాలపై ప్రభావం చూపుతోంది. సర్వనాశనం చేస్తోంది. అప్పులపాలై ఆత్మహత్యలకు గురవుతున్న ఘటనలూ చూస్తున్నాం. పట్టణంలో మధ్యతరగతి కుటుంబానికి చెందిన ఒక వ్యక్తి మట్కా జూదంలో రూ.70 లక్షలు పోగొట్టుకొని, అప్పుల పాలై స్థలాల తెగనమ్మి చెల్లించిన సంఘటన చోటుచేసుకుంది. పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో రెండు హెూటళ్ల వద్ద బ్రాకెట్ ఏజెంట్లు కూర్చుని రహస్యంగా మట్కా జూదాన్ని నడిపిస్తూ రోజుకు లక్షల రూపాయలు ఆదాయాన్ని పొందుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకసారి మట్కా జూదానికి అలవాటుపడిన వారు పోయిన డబ్బులు తిరిగి వస్తాయనే ఆశతో మళ్లీ మళ్లీ డబ్బులు చెల్లిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. వినుకొండ పట్టణంతోపాటు నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో యువత బ్రాకెట్ జూదానికి బానిసలుగా మారుతున్నట్లు తెలుస్తోంది.

**గతంలో పోలీసులు కేసులు నమోదు చేసినప్పటికీ..**

గతంలో మట్కా జూదానికి అనేక మంది బలికావడంతో పోలీసులు సంబంధిత ఏజెంట్లపై కేసులు నమోదు చేసి ఉక్కుపాదం మోపారు. కొన్నేళ్లపాటు వినుకొండ పరిసర ప్రాంతాల్లో సద్దుమణిగిన ఈ తరహా జూదం.. ఇటీవల కాలంలో మళ్లీ జోరు పెంచుకుంది. కొంతమంది ఈ జూదానికి బానిసలుగా మారుతున్నారు. దీనిపై పోలీసులు మరోసారి దృష్టి సారించాలని ప్రజలను కోరుతున్నారు.



# మిగిలేది.. చాకిరే!

- పనికి తగ్గ వేతనమేదీ?
- శ్రమ దోపిడీకి గురవుతున్న కార్మికులు

**ప్రజాశక్తి - చిలకలూరిపేట**

ఆర్థిక ఇబ్బందులతో కొందరు.. కుటుంబాలు గడవని పరిస్థితిలో మరికొందరు.. అర్ధాంతరంగా చదువులు ఆపేసిన వారు ఇంకొందరు.. పలు వ్యాపార సంస్థల్లో కార్మికులుగా మగ్గిపోతున్నారు. శ్రమకు తగ్గ వేతనం లేక, శ్రమదోపిడీకి గురవుతున్నారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి యువతీయువకులు పెద్ద దుకాణాలు, వస్త్ర షాపులు, సూపర్ మార్కెట్లు, పెట్రోల్ బంక్, కేటరింగ్ సంస్థలు, మెకానిక్‌ల వద్ద పనికి కుదురుతున్నారు. వీరిలో అత్యధికంగా యువత, మహిళలే ఉంటున్నారు. ప్రతి సంస్థలోనూ పదుల సంఖ్యలో ఉద్యోగాలు చేస్తున్నారు. పట్టణంలో ప్రముఖ వ్యా పార సంస్థ లు 40 నుంచి 50 వరకు ఉన్నాయి. వీటిలో సుమారు 3 వేల మందికిపైగా పని చేస్తున్నారు. ఏ సంస్థలోనూ కార్మిక చట్టాలు అమలు కావడం లేదు. ఆయ సంస్థల యాజమాన్యాలు పాటిస్తుందే చట్టం. అధికారుల తనిఖీలు పూర్తిగా కొరవడటంతో ఆయా సంస్థలల్లో పని చేసే ఉద్యోగులు పడుతున్న అవస్థలు వర్ణానాతీతంగా మారాయి. సరైన ఉపాధి లేక పోవడంతో అనేక మంది యువత ఈ సంస్థల్లో పని చేసేందుకు వస్తున్నారు.

**పని గంటల అమలెక్కడ?**

ముఖ్యంగా పని గంటల విషయంలో నిబంధనలేవీ అమలు కావడం లేదు. ఆయా సంస్థల్లో రోజుకు 11 నుంచి 12 గంటల వరకు నిర్బంధంగా పని చేయించుకుంటున్నారు. ఉదయం తొమ్మిది గంటలకు పని ప్రారంభిస్తే రాత్రి 9 గంటల వరకు వదలడం లేదని పలువురు వాపోతున్నారు. ఇంత పని చేస్తే.. నెలకు రూ.7వేల నుంచి రూ.10 వేలలోపే అందుతోందని పలువురు మహిళలు వాపోతున్నారు. కార్మిక చట్టాల ప్రకారం రోజుకు ఎనిమిది గంటలు మాత్రమే పని చేయిం చాల్సి ఉంది. అంతకు మించి ఎక్కువ పని గంటలు చేస్తే ఓ టి.(ఓవర్ టైం)కింద రెట్టింపువేతనం చెల్లించాలి. ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. వాస్తవానికి ఆయా సంస్థల్లో పని చేసే ఉద్యోగులకు కనీస వేతనం చెల్లించాలి.. పీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలి. వెల్ఫేర్ ఫండ్ కట్టాలి. ప్రతి ఏటా బోనస్ చెల్లించాలి. మధ్యా హ్న భోజనం చేసేందుకు ప్రత్యేక సదుపాయం కల్పించాలి. ఇది ఎక్కడా ఆచరించడం లేదు. ఆదివారం, పండగ దినాల్లోనూ పని చేయిస్తున్నా అదనంగా ఎటువంటి వేతనమూ ఇవ్వడం లేదని కార్మికులు చెబుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ నిలువకాళ్లపై నిలబడి పని చేస్తుండటంతో మోకాళ్ల నొప్పులతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలువ వెంటాడుతున్నాయని ఆందోళన చెందుతున్నారు.

**తనిఖీలు శూన్యం**

అధికారుల తనిఖీలు లేకపోవడంతో వ్యాపార సంస్థల్లో నిబంధనలు అమలు కావడం లేదు. దాదాపు అన్ని సంస్థల్లోనూ సీసీ కెమెరాలు ఉంటాయి. ఉద్యోగులు ఎన్ని గం టలకు వస్తున్నారు. ఎన్ని గంటలకు వెళ్తున్నారో పక్కాగా తెలుస్తుంది. సూ పర్ మార్కెట్లో, ఇతర సంస్థలలో పని చేసే ఉద్యోగుల పని గంటలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కనీసం వేతనం రూ.15 వేలైనా చేసి.. పని గంటలు అమలయ్యేలా చూడాలని కార్మికులు కోరుతున్నారు.

# తెగ తాపించి.. మరింత 'మందు'చూపు

**ప్రజాశక్తి-చిలకలూరిపేట**

డిసెంబరు 31, నూతన సంవత్సరం, సంక్రాంతి పండగలు గత నెల మద్యం విక్రయాలను అమాంతం పెంచాయి. మరోవైపు ఇప్పటికే రూ.లక్షల్లో చెల్లించి, లైసెన్సులు దక్కించుకున్న వైన్ షాపు యజమానులు.. బెల్టుషాపులను ప్రోత్సహించి, అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్న విషయం విదితమే. ఈ నెల కూడా 'టార్గెట్'ను రీచయ్యేందుకు శ్రమిస్తున్నారు. అందుకు పరిస్థితులు కూడా వారికి కలిసొస్తున్నాయి. చిలకలూరిపేట పట్టణంలో 6, మండలంలోని పలుచోట్ల మరో మూడు మద్యం దుకాణాలున్నాయి. నాదెండ్ల పరిధిలో 5, యడ్లపాడులో 3 దుకణాలు ఏర్పాటయ్యాయి. వీటికి బార్ అండ్ రెస్టారెంట్లు అదనం. జనవరి నెలలో పండగల పుణ్యమానీ.. రూ.10,67,74,727ల మేర అమ్మకాలు జరిగాయి. వీటికితోడు బెల్టుషాపుల్లో దోపిడీ అదనం. సాధారణంగా ప్రతి నెలా ఇక్కడ రూ.7 కోట్ల నుంచి రూ.8 కోట్ల మేర వ్యాపారం జరుగుతోంది. సంక్రాంతి, న్యూ ఇయర్.. ఇలా కలిసిరావడంతో అదనంగా మరో రూ.2 కోట్ల మద్యాన్ని మందుబాబులు తాగేశారు. రిపబ్లిక్ డే రోజున కూడా వదలలేదు. ఇప్పుడు కోటప్పకొండ తిరునాళ్ల, ఎమ్మెల్సీ ఎన్నికలు వస్తుండటంతో విక్రయాలు జోరుగా సాగుతాయని మద్యం దుకాణదారులు భావిస్తున్నారు. ఆ మేరకు సరకు నిల్వలు తెచ్చి పెట్టుకుంటున్నారు. బెల్టుషాపులకూ జోరుగా తరలిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



# అనధికార నిర్మాణాలపై నిఘా పెట్టండి

## నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



అధికారులతో కలిసి పనులు పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో వార్డు సచివాలయాల వారీగా అనధికార కట్టడాల నిర్మాణాలపై ప్లానింగ్ కార్యదర్శులు నిరంతరం నిఘా పెట్టి పర్యవేక్షించాలనీ, నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం కమిషనర్ వికాస్‌నగర్, ఎస్‌విఎన్ కాలనీ, కొరెటెపాడు ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి పనులు, పారిశుధ్య పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో అనధికార కట్టడాలపై పలు ఫిర్యాదులు అందుతున్నాయని, క్షేత్ర స్థాయిలో ప్లానింగ్ కార్యదర్శులు, టిపిబిఓలు పక్కాగా పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రతి కార్యదర్శి హ్యాండ్ బుక్ లేదా డైరీ నిర్వహించాలని ఆదేశించారు. సచివాలయం పరిధిలో ప్రతి నిర్మాణం నిబంధనల మేరకే జరగాలని, నిర్మా ణం చేసుకునే వారు ప్లాన్‌కి దరఖాస్తు చేసు కునే విధానంపై అవగాహన కల్పించాలన్నారు. నిర్మాణం పూర్తి అయిన ప్రతి భవనానికీ ఆస్తి పన్ను విధించేలా అడ్మిన్ కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలన్నారు. బహుళ అంతస్తు భవనాలకు కూడా ఓసి వచ్చే వరకు వేచి ఉండకుండా నివాసం ఉండే ప్లాట్‌లకు పన్ను విధించాలని ఆదేశించారు. తమ క్షేత్ర స్థాయి పర్యటనల్లో అండర్ అసెస్‌మెంట్లు, అన్ అసెస్‌మెంట్లను గుర్తిస్తే సంబంధిత అడ్మిన్ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పర్యటనలో డిఈఈ రమేష్‌బాబు, ఆర్ఓ మదన్‌గోపాల్, ఏసిపి రెహ్మాన్, టిపి ఎస్‌లు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్య దర్శులు పాల్గొన్నారు.



అధికారులతో కలిసి పనులు

## బ్రెయిన్ క్యాన్సర్ చిన్నారికి చేయూత

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లికి చెందిన కార్తీక అనే చిన్నారి బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఇప్పటికే హైదరాబాదులోనే బసవతారకం క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లలో తొమ్మిది సర్జరీలు, 30కీమోలు, 30 రేడి యేషన్లు జరిగాయి. అయినా ఆరోగ్యం కుదుటపడలేదు. ఇప్పటికీ ఇంటిదగ్గర ఫిజియో థెరపీ నిర్వహిస్తున్నట్లు పాప తల్లి దండ్రులు తెలిపారు. విషయం తెలుసుకున్న జనసేన నాయకులు జొన్న రాజేష్, వీరిశెట్టి వెంకటేశ్వరరావు శనివారం కార్తీక తల్లిదండ్రులను కలిసి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు.

## జనాభా దామాషాలో నామినేటెడ్ పోస్టుల భర్తీపై హర్షం

ప్రజాశక్తి - మంగళగిరి

గత ప్రభుత్వం నామినేటెడ్ పదవుల్లో బీసీలు మైనారిటీలకు కలిపి 29శాతం కేటాయించాలని తెచ్చిన చట్టాన్ని రద్దుచేసి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు వారి జనాభా దామాషాలో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయాలని రాష్ట్ర మంత్రి మండలి తీసుకున్న నిర్ణయాన్ని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలలో 34 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలనుకున్నట్లే, నామినేటెడ్ పదవుల్లోనూ 34 శాతం రిజర్వేషన్లు ఇచ్చేలా చట్టం చేయాలని, బీసీ కులాలకు జనాభా దామాషా మేరకు పదవులు కేటాయించేలా నిర్ణయం తీసుకోవడం సంతోషదాయకమని పేర్కొన్నారు. నామినేటెడ్ పదవుల్లో బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలైన బహుజన వర్గాలకు 50 శాతం ఇవ్వాలని మంత్రిమండలి నిర్ణయం తీసుకుందనీ, అలా కాకుండా నామినేటెడ్ పదవుల కేటాయింపు రాష్ట్ర మంత్రి మండలి చేతుల్లో ఉంటుంది కాబట్టి, రాష్ట్ర జనాభాలో 85 శాతంగా ఉన్న బహుజన వర్గాలకు వారి వారి జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు కేటాయించాలని, అందులో బీసీలకు 50 శాతం ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు గైకొనాలని పేర్కొన్నారు.



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న దాత చుండూరు భాస్కర్‌రావు

## పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - చేబ్రోలు

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 174 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. నారాకోడూరు ప్రధానోపాధ్యాయులు ఏడుకొండల అధ్యక్షతన దాత దుగ్గిరాల గ్రామస్తులు చుండూరు భాస్కర్‌రావు ఆర్థిక సహకారంతో ఒక్కొక్కరికి రూ.125లు విలువగల పరీక్ష సామాగ్రి కిట్లులు అందజేశారు. భాస్కర్‌రావు మాట్లాడుతూ 'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. ప్రదానోపాధ్యాయులు, కమిటీ సభ్యులు దుశ్శాలువాతో భాస్కరరావును సత్కరించి, కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పసుపులేటి గణేష్ , జాగతి భారతి సేవా సంస్థ అధ్యక్షులు పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ వి.నాగమల్లేశ్వరరావు కమిటీ సభ్యులు పి. భాస్కరరావు వెలగా పవన్‌కుమార్, ఉపాధ్యాయులు కోటి పద్మ సల్మా కార్టూన్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రధాన తపాలా కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ ప్రకాష్

ప్రజాశక్తి-తెనాలి రూరల్

కొత్తపేటలోని ప్రధాన తపాలా కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ కె ప్రకాష్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. పోస్టల్ మెయిల్స్, ట్రెజరీ, పొదుపు ఖాతాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఇండియపోస్టు దేశవ్యాప్తంగా విస్తృత ఉనికిని కలిగిఉందన్నారు. ఇండియా పోస్టును దేశంలో ప్రధాన లాజిస్టిక్ ప్లేయర్‌గా ఇటీవల జరిగిన బడ్జెట్ ప్రకటనలో ప్రధాని మోదీ స్వయంగా ప్రకటించారన్నారు. ఈ కామర్స్ రాకతో ఇండియా పోస్ట్ ప్రాముఖ్యత పెరిగిందన్నారు. అధునాతన పోస్టల్ సొల్యూ షన్‌తో ఐటి 2.ఒను ఇండియా పోస్ట్ ఆవిష్కరించిం దన్నారు. 2.ఒ అనే ప్రధాన సాంకేతిక అప్డేట్‌ను ప్రారం భించినట్లు తెలిపారు. పి.ఎల్.ఐ(పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్), డిబిటి (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్) ద్వారా ఐ.పి.పి.బి(ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్) ప్రీమియం ఖాతాలోకి నిధులను బదిలీ చేయడం, ప్రైమ్ మినిస్టర్స్ యోజన, కిసాన్ యోజన, ఆధార్‌కార్డ్, పాస్ పోర్ట్ సహా ఇండియా పోస్ట్ అందిస్తున్న సేవలు ప్రతి గ్రామాల్లోకి చేరేవిధంగా విస్తృత ప్రచారం నిర్వ హించాలన్నారు. రెండు రోజులుగా తపాలా శాఖ ఆధ్వర్యంలో పొదుపు ఖాతాల మేళా నిర్వహించినట్లు పేర్కొన్నారు. డివిజన్ సూపరింటెండెంట్ జి.కరుణాకరబాబు, పోస్ట్‌మాస్టర్ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గున్నారు.

## శాస్త్రీయ సమాజ నిర్మాణం ప్రతిఒక్కరి బాధ్యత

### నిడమర్రులో ప్రారంభమైన నాస్తిక మేళాలో వక్తలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

శాస్త్రీయ సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యతగా ఉండాలని పలు వు రు వక్తలు పిలుపునిచ్చారు. నిడ మర్రు చార్వాక ఆశ్రమంలో నాస్తిక సమాజం ఆధ్వర్యంలో 33వ నాస్తిక మేళా శనివారం ప్రారంభమైంది. సైం టిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్, కార్యదర్శి, ఫిర సభ్యురాలి స్వాగతోపన్యాసంతో ప్రారంభమైన సమావేశానికి నాస్తిక సమాజం నాయకులు సిహెచ్. శివారెడ్డి అధ్యక్షత వహించారు. "భవిష్యత్తు ఆలో చనాపరుడు పెరియార్" అనే అంశం పై - ది రేషనలిస్ట్ ఫోరం, తమిళనాడు అధ్యక్షులు ఆర్.తమిళ్ సెల్వన్ మాట్లాడుతూ పెరియార్ రామస్వామి మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా, శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం జీవితాంతం కృషి చేశారనీ చెప్పారు. కులవ్యవస్థకు వ్యతి రేకంగా పోరాడారన్నారు. రామస్వామి చేసిన కృషి ఫలి తంగానే నేడు తమిళనాడులో శాస్త్రీయ ఆలోచనలో ముందు కెళ్లడం, కులవ్యవస్థకు వ్యతి రేకంగా పోరాటం చేసి ఎంతో మంది ముఖ్యమంత్రి అవ్వడానికి పెరియార్ రామస్వామి చేసిన ఉద్యమం తోడ్పడిందన్నారు. "సైన్స్-మీదా? మాదా?" అనే అంశం పైన రాయ పూర్ ఎయిమ్స్ ప్రొఫెసర్ కె. విజయ్‌కుమార్ మాట్లాడుతూ సైన్స్ ఎలా అభివృద్ధి చెందింది? జీవపరిణామం ఎలా జరిగింది? డార్విన్ మహాశయుడు ఏమి చెప్పారు? ఈ రోజులలో సూడోసైన్స్ ఎలా ప్రజల ముందుకు వస్తుంది అనే అంశాలపై వివరించారు. "అభ్యుదయవాదులు తరగతి గదిని ఆసక్తికరంగా మార్చడం ఎలా" అంశంపై జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ బ్రహ్మారెడ్డి మాట్లాడారు. పిల్లలకు ఆసక్తికరంగా కథల రూపంలో సైన్సును బోధించాలని చెప్పారు. విద్యార్థులను ఇన్వాల్వ్ చేసి వారు ప్రశ్నలు అడిగే విధంగా చేసి విషయాన్ని వారికి అర్థఎయ్యేలా వివరించాలని చెప్పారు. పిల్లలు చిన్న తనంలో ఆలోచించడం ప్రారంభిస్తే పెద్దయ్యాక మూఢ విశ్వాసాలు విడిచి శాస్త్రీయంగా సైన్స్‌పరంగా ఎదుగుతారన్నారు.



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

## 67వ రోజుకు కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు శనివారానికి 67 రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ఆర్.ఇజ్రాయిల్, ఎం.గురవయ్య, వై.యహెూశోవ, హెచ్.పిచ్చయ్య, టీ.నాగేశ్వరరావు కూర్చున్నారు. దీక్షలను సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కష్టానికి తగ్గ ప్రతిఫలం మాత్రమే అడుగు తున్నామని ప్రభుత్వానికి తెలిపారు. తమకు సముచితంగా రావలసిన బకాయిలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం అందుకు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎం ఆశీర్వా దం, బి అంకయ్య, దుర్గ భవాని, ఈ. సారమ్మ, లక్ష్మీ, సులోచన, షరీఫ్, ఎం.శివకుమారి, ఎస్‌కే.ఇమాంబి, డి.రమణ పాల్గొన్నారు.

## కండక్టర్ నాగేశ్వరరావుకు డాక్టరేట్

ప్రజాశక్తి - తెనాలి



సహారా చారిటబుల్ ట్రస్ట్ పట్టణానికి చెందిన కవి, ఆర్టీసీ కండక్టర్ ఆళ్ల నాగేశ్వరరావుకు గౌరవ డాక్టరేట్ ఆన్‌లైన్ వేదికగా బహూకరించినట్లు శనివారం ఆయన వెల్లడించారు. ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డా.అక్లాఖ్ అహమ్మద్ పంపిన అవార్డు ప్రధాన ప్రశంసా పత్రాన్ని ఆళ్ళ నాగేశ్వరరావు వాట్సప్ వేదికగా అందుకున్నారు. నాలుగు దశాబ్దాలుగా ఆళ్ళ చేస్తున్న సామాజిక, సాహిత్య సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ ప్రధానం చేసినట్లు అక్లాండ్ అహ్మద్ చెప్పారని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావును గుంటూరు ఆర్టీసీ జిల్లా అధికారి యం.రవికాంత్, గుంటూరు -2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం, ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ కె.సాంబశివ ఆయనను అభినందించినట్లు ఆళ్ల తెలిపారు.

## ఎల్ఐసి సీనియర్ ఏజెంట్స్‌కు అభినందన

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక కొత్తపేటలోని భారతీయ జీవిత బీమా సంస్థ కార్యాలయంలో శనివారం ఎల్ఐసి ఏజెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ ఏజెంట్స్ సన్మాన కార్యక్రమం జరి గింది. మచిలీపట్నం డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ డాక్టర్॥ సుధాకర్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని సంస్థ అభి వృద్ధిలో ఏజెంట్స్ పాత్రను ప్రశంసించారు. సీనియర్ ఏజెం ట్స్‌ను సత్కరించారు. కార్యక్రమంలో విశిష్ట అతిథిగా డిఎస్పీ బి.జనార్దన్ రావు, తెనాలి సీనియర్ బ్రాంచ్ మేనేజర్ గౌతమ్ భీమారావు, మచిలీపట్నం డివిజన్ నాయకులైన ఎన్.వెంకటేశ్వరరావు,ఎ.రవీంద్రరెడ్డి, జగన్నాథం సన్నాలరఘు, కళ్ళం శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరావు, సన్మాన గ్రహీతలు జి.సురేష్, కె. ఉమా మహేశ్వరరావు, మోహన్, భాస్కర్ శశి కుమార్, కె భాస్కరరావు, సిహెచ్. కుమార్ రాజా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ సుధాకర్‌బాబు



# ఆప్కాస్ రద్దు నిర్ణయం సరికాదు

**రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని యూనియన్ నాయకుల డిమాండ్**

ప్రజాశక్తి-గుంటూరు



మీడియాతో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగు ల నియామకాలు, జీతాల చెల్లింపు ప్రక్రి యను ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఎపీ గవర్నమెంట్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ జెఎసి జిల్లా చైర్మన్ బి.లక్ష్మణరావు, సెక్రటరీ జనరల్ బి. ముత్యాలరావు డిమాండ్ చేశారు. శనివారం బ్రాడీపేట లోని సిఐటియు నగర కార్యాల యంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆరో తేదీన జరిగిన మంత్రివర్గంలో ఆప్కాస్‌ను రద్దు చేస్తూ పాత పద్ధతిలోనే కాంట్రాక్టర్లకు అప్పజెప్పాలని నిర్ణయం చేసినట్టు తెలిసిందని, ఇది సరైన విధానం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యో గులు, కార్మికులకు నష్టం చేకూర్చే విధంగా అనేక నిర్ణయాలు చేస్తుందని విమర్శించారు. ప్రస్తుతం ఆప్కాస్ పద్ధతిలో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల నియామకాలు జరుపు తున్న నేపథ్యంలో ఈ విధానాన్ని మార్చి రాష్ట్రంలో ప్రస్తుతం పని చేస్తున్న 2.50లక్షల మందిని ఉద్యోగుల భవితవ్యాన్ని ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలని చూస్తుందన్నారు. ఈ నిర్ణయం అమలు చేస్తే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, డైలీవేజ్, కంటిజెంట్ ఉద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందని, సకాలంలో జీతాల చెల్లింపు జరిగే పరిస్థితి ఉండదని, పిఎఫ్, ఈఎస్ఐ, కూడా అమలు చేయరని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఏజెన్సీలు రాజకీయ నిరుద్యోగ పునరావస కేంద్రాలుగా మారి ఉద్యోగులకు రాజకీయ వేధింపులు, తొలగింపులు పెరిగే ప్రమాదం ఉందన్నారు. ఏదైనా వ్యవస్థను మార్చే క్రమంలో మెరుగైన దిశగా నిర్ణయాలు చేయాలని, కానీ ఉన్న దానిని కూడా రద్దు చేసే విధంగా ఉండకూడదన్నారు. గతంలో ప్రైవేటు ఏజెన్సీలకు ఏడు శాతం కమిషన్ ఇస్తే ఆప్కాస్‌కు కేవలం ఒక శాతం కమిషన్‌తో ప్రభుత్వానికి ఉపయోగకరంగా ఉండటమే కాకుండా సమయానికి ఈపీఎఫ్, ఈఎస్ఐ కడుతున్నాయన్నారు. మెరుగైన విధానంలోకి తీసుకెళ్లాలంటే పర్మినెం ట్ చేయటం మార్గం తప్ప తిరిగి పాత పద్ధతికి తీసుకెళ్లటం సరికాదన్నారు. ఈ విధానానికి వ్యతిరేకంగా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో జేఏసీ నాయకులు పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు




నూతన కారును ప్రారంభిస్తున్న ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు

## కాలుష్య నివారణకు విద్యుత్ వాహనాలు

**ఎస్‌యువి కారును ప్రారంభించిన ఎపి లావు శ్రీకృష్ణదేవరాయులు**

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పెరుగుతున్న వాతావరణ కాలుష్యంతో విద్యుత్ వాహనాల వినియోగం పెరిగిందని నరసరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయులు అన్నారు. గుంటూరు జెకెసి కళాశాలలో శనివారం పయనీర్ అటో మొబైల్స్ ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన మహింద్ర ఎలక్ట్రిక్ ఆర్జిన్ ఎస్‌యువి కారును శ్రీకృష్ణదేవరాయులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పూర్వి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందంచిన ఈ వాహనం బ్యాటరీ 79 కెవి సామర్థ్యంతో పనిచేస్తుందని ఒక సారి ఛార్జింగ్ చేస్తే 650 కిలో మీటర్లు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ చైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ, చుక్కపల్లి రమేష్, చుక్కపల్లి రాకేష్, టివి రావు తదితరులు పాల్గొన్నారు.

## మలినేనిలో ముగిసిన 36 గంటల హ్యాకథాన్

ప్రజాశక్తి-గుంటూరు

మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కాలేజిలో రెండ్రోజులపాటు సిఎస్ఇ డేటా సైన్స్ విద్యార్థులకు మేక్‌స్కిల్డ్ ఆధ్వర్యంలో 'ఎఐ ఫర్ వెబ్ డెవలప్ మెంట్'పై 36 గంటల హ్యాకథాన్ శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి జ్యూరీ సభ్యులుగా వాస్కన్ సొల్యూషన్స్ ఫౌండర్, సిఇఒ నెల్లూరు సాయితరుణ్, లవ్‌లీ చాకోస్, బిగులు ఫౌండర్ సత్యవాసిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినులు తయారు చేసిన ప్రతి ప్రాజెక్టులో ప్రయోగాత్మకత, ఆధునిక సాంకేతికతతో కూడి నేటి తరానికి స్ఫూర్తిగా ఉన్నాయన్నారు. మలినేని విద్యా సంస్థల అధినేత డాక్టర్ పెరుమాళ్లు మాట్లాడుతూ నేటి పోటీ రంగానికి ధీటుగా ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ టెక్నాలజీని ఉపయోగించి విద్యార్థినులు తమ ప్రతిభను మెరుగుపరుచుకోవాలన్నారు. తమ విద్యార్థినులు స్టార్టప్‌లు ప్రారం భించే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె. అప్పారావు, సిఎస్ఇ డైటా సైన్స్ హెడ్ ఎన్. హరికృష్ణ, ఇతర విభా గాధిపతులు, మేక్‌స్కిల్డ్ కంపెనీ సిఇఒ పి.మధు తదితరు లు పాల్గొన్నారు.



విద్యార్థులకు ధృవీకరణ పత్రాలు అందచేస్తున్న సాయితరుణ్ తదితరులు

# ధరల్లేక అల్లాడుతున్న మిర్చి రైతులు

ధరలు తగ్గిపోయి ఉమ్మడి గుంటూరు జిల్లాలో మిర్చి రైతులు అల్లాడిపోతున్నారు. గతేడాది కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన సరుకు ఇప్పటికీ అమ్ముడుపోక రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ దశలో ప్రభుత్వంపై మిర్చి రైతులు ఆశలు పెట్టుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ ఆర్థిక పరిస్థితి బాగా లేదని రైతులను ఆదుకోవాలని కేంద్రానికి లేఖ రాసింది. కేంద్రం ఇంత వరకు స్పందించలేదు. ఇటీవల టిడిపి ఎంపిలు ఆ పార్టీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయులు సమక్షంలో ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిశారు. ఆయన వ్యవసాయ శాఖ అధికారులతో సంప్రదించాలని టిడిపి ఎంపిలకు సూచించారు. అధికారులను కలవగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరించాలని ప్రతిపాదించారు. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదని మొత్తం కేంద్రమే భరించాలని ఎంపిలు కోరారు. అయితే ఈ అంశంపై అధికారుల నుంచి ఇంత వరకు స్పందన రాలేదు. తక్షణం క్వింటాలుకు రూ.12 వేలు తగ్గకుండా మార్కెట్ ఇంటర్ వెన్షన్ పథకం కింద సాయం కావాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. కేంద్రం ఇంత వరకు సానుకూలంగా స్పందించకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. కేంద్రం నుంచి ఎంత సాయం అందుతుందనే అంశంపై తమకు ఎటువంటి సమాచారం లేదని అధికారులు చెబుతున్నారు. ధర తక్కువగా ఉన్నా యార్డుకు నిత్యం లక్ష టిక్కిలకు పైగా సరుకు వస్తోంది. కోల్డ్ స్టోరేజీలో ఉన్న పాత నిల్వలు కదలడం లేదు. కొత్త సరుకుకు ధరలు పెరగడం లేదు. కోల్డ్ స్టోరేజీల్లో ఉన్న నిల్వలను ఎలా విక్రయించుకోవాలో తెలియక వ్యాపారులు, రైతులు ఆందోళనలో ఉన్నారు. ఒక వైపు తెగుళ్లలో ఉత్పత్తి తగ్గింది. మరో వైపు వేర్వేరు కారణాలతో ధరలు తగ్గాయి. పెట్టుబడులు పెరిగాయి. ఎకరాకు రూ.లక్ష నుంచి లక్షన్నర వరకు ఖర్చు చేశారు. తీరా అమ్ముకునే సరికి క్వింటాలు సగటు ధర రూ.10 వేలు వస్తుండటంతో కనీస పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులు అల్లాడుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో కూడా మిర్చి సాగు పెరిగిందని, అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ లేదని చెబుతూ గత కొంత కాలంగా మిర్చి ధరలను వ్యాపారులు తగ్గిస్తున్నారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది ధరలు మరింత తగ్గాయి. గత ఏడాది ఫిబ్రవరి మొదటి వారంలో సగటున క్వింటాలు మిర్చి ధర రూ.18 వేలు ఉండగా ఈ ఏడాది ప్రస్తుతం రూ.10 వేల నుంచి రూ.12 వేలు మించి దాటడం లేదు. కొత్త సరుకు తీసుకుని వచ్చిన రైతులకు కూడా తీవ్ర నిరాశ ఎదురవుతోంది. పేరెన్నిక గన్న రకాలు కూడా పెరగడం లేదు. రాష్ట్రం నలుమూలల నుంచి గుంటూరు యార్డుకు సరుకు వస్తున్నా ధరలు ఆశాజనకంగా లేకపోవడం వల్లరైతులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. అంతేగాక రెండు మూడు రోజులు వేచి ఉంటే తప్ప తమ సరుకును అమ్ముకోలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు. మరో వైపు మిర్చిలో తాలు వచ్చినా, రంగు మారినట్టు కన్పించినా వెంటనే ధరను మరింత తగ్గించేస్తున్నారు. ఈపరిస్థితుల్లో ప్రభుత్వం జోక్యం చేసుకుని కనీస మద్దతు ధర క్వింటాలు రూ.15 వేలు గా ప్రకటించాలని రైతులు కోరుతున్నారు. ఈ ధరకు తగ్గకుండా ప్రభుత్వం మార్క్ఫెడ్ లేదా నాఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. లేదంటే ప్రభుత్వమే మార్కెట్ ఇంటర్ వెన్షన్ పథకం ద్వారా ఆర్థిక సాయం చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

వీక్షణం

(ఎ.వి.డి.శర్మ)

## ఆర్‌విఆర్ జెసి విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-గుంటూరు

క్యాప్జెడర్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాలకు చెందిన వివిధ విభాగాల విద్యార్థులు 54 మంది ఉద్యోగాలు సాధించారనిఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని పేర్కొన్నారు. శనివారం ఉద్యోగాలు పొందిన విద్యార్థులను కళాశాల సిబ్బంది అభినందించారు. ప్రతిభ ఆధారంగా రూ.9.5 లక్షల వరకూ వార్షిక వేతనంతో ఉద్యోగాలు సాధించారని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ రాయపాటి గోపాలకష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకూ 612 మంది ఉద్యోగాలు సాధించారన్నారు. విద్యార్థులను అభినందించిన వారిలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, వివిధ శాఖల విభాగాధిపతులు, కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్స్ సి.హెచ్. శ్రీనివాసరావు, డాక్టర్ కె.సురేష్‌బాబు తదితరులు ఉన్నారు.

# సంకల్ప బలంతో పాటు నిజాయితీ ఉండాలి

**సినీ దర్శకుడు, స్క్రీన్‌ప్లే రైటర్ రవీంద్ర (బాబీ) - ఘనంగా ముగిసిన విజ్ఞాన్ మహోత్సవం**

ప్రజాశక్తి-గుంటూరు

మన కలలను సాకారం చేసుకోవడానికి సంకల్ప బలంతోపాటు నిజాయితీ కూడా ఉండాలని సినిమా డైరక్టర్, స్క్రీన్ రైటర్ కె.ఎస్.రవీంద్ర (బాబీ) అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో మూడ్రోజులపాటు నిర్వహించిన జాతీయ స్థాయి విజ్ఞాన్ మహోత్సవ్ శనివారం అంగరంగ వైభవంగా ముగిసింది. క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి అదరహోఅనిపించారు. ఆటల్లో, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు ట్రోఫీలను, రూ.15 లక్షల నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సినిమా డైరెక్టర్, స్క్రీన్ రైటర్ కే.ఎస్.రవీంద్ర మాట్లాడుతూ మనం జీవితంలో ముందుకు వెళ్లాలంటే అల్లరితో పాటు క్రమశిక్షణ కూడా ఉండాలన్నారు. మీకు ఏరంగంలో ఇష్టం ఉంటే ఆ రంగంలోకి వెళ్లిపోండని విద్యార్థులకు సూచించారు. 2024 పారాలింపిక్స్ బ్రాంజ్ మెడలిస్ట్, ఇండియన్ పారా పిస్టల్ షూటర్, అర్జున అవార్డీ రుబినా ఫ్రాన్సిస్ మాట్లాడుతూ జీవితంలో మొదటగా మిమ్మల్ని మీరు నిరూపించుకోవాలని అన్నారు. తాను 10వ తరగతి నుంచి స్పోర్ట్స్ జర్నీను ప్రారంభించానని, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో 7వ స్థానంలో నిలిచినప్పుడు 6 నెలల పాటు కుంగుబాటుకు గురయ్యానని పేర్కొన్నారు. దానిని నుంచి త్వరగా కోలుకుని 2024 పారిస్‌లో జరిగిన పారాలింపిక్స్‌లో దేశానికి బ్రాంజ్ మెడల్ తీసుకురాగలిగానన్నారు. విజ్ఞాన్స్ మహొత్సవ్ ద్వారా విద్యార్థులకు నూతన అనుభవం పొందే అవకాశం లభించిందని వర్సిటీ సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి అన్నారు. నాయకత్వ లక్షణాలు, టీమ్ స్పిరిట్, అలవడుతుందన్నారు. ఈ సందర్భగా 'వాయిస్ ఆఫ్ విజ్ఞాన్' మ్యాగజైన్‌ను అతిధులు ఆవిష్కరించారు. మహొత్సవ్‌లో భాగంగా మొత్తం 80 ఈవెంట్లలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు విలువైన నగదు బహుమతులతో పాటు ట్రోఫీలను అందించారు. క్రికెట్ విజేత విజ్ఞాన్స్ యూనివర్సిటీ జట్టుకు రూ.50 వేల నగదు బహుమతి అందించారు. రన్నర్‌గా నర్సరావుపేట ఇంజినీరింగ్ కాలేజ్ జట్టు నిలిచింది. మహిళల వాలీబాల్‌లో జీఈసీ కాలేజ్ మొదటి స్థానం, ఎస్‌విసిఈ రెండో స్థానం, బాస్కెట్‌బాల్‌లో కేఎల్‌యూ మొదటి స్థానం, మోహన్‌బాబు యూనివర్సిటీ రెండోస్థానం సాధించాయి. కబడ్డీలో వీఎన్ఆర్ వీజేఐటీ మొదటి స్థానం , ఎస్వీసీ రెండోస్థానంలో నిలిచాయి. ఖోఖోలో అనురాగ్ యూనివర్సిటీ మొదటి స్థానం, జీ.నారాయణమ్మ ఇంజినీరింగ్ కాలేజీ రెండోస్థానంలో నిలిచాయి. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.




విజేతలకు బహుమతులు అందచేస్తున్న రవీంద్ర, రుబినా ఫ్రాన్సిస్ తదితరులు



నృత్యప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు